# సుబ్రమణ్య షష్టి సందర్భంగా ప్రత్యేక కళ్యాణం



పాకాల, నవంబర్ 26, (ప్రభాతవార్త
సుబ్రమణ్య షష్టి సందర్భంగా చంద్రగిరి నియోజకవర్గంలోనో పాకాల మండలం పాళ్యం కొండ ఆనందగిరిలో వెలసిన శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధా రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించి కళ్యాణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొన్న దంపతులకు ఆలయం తరఫున ప్రసాదాలు, పసుపుకుంకుమ, జాకెట్టు, కండువా అందజేశారు. భక్తులందరికీ ఉచిత భోజన సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చంద్రశేఖర్ నాయుడు, ఈవో యువరాణి, సింగల్ విండో చైర్మన్ కృష్ణమనేని సావిత్రి సావిత్రమ్మ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త







తిరుచానూరు పద్మావతి అమ్మవారికి బుధవారం రాత్రి పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

## తెలుగు తమ్ముళ్ళకు
# పదవులు ఏదీ!?



ప్రభాతవార్త-తిరుపతి:
ఏరుదాటేవరకు ఏటి మల్లన్న ఏరుదాటాక బోడి మల్లన్న అనే చందంగా సిఎం చంద్రబాబు సొంత జిల్లాలో తెలుగుతమ్ముళ్ళ పరిస్థితి మారిందా? పదవుల కోసం ఆశనిరాశల్లో కొట్టుమిట్టాడుతున్నారు. పార్టీలో సుదీర్ఘంగా కష్టపడిన వారికి పదవులు ఉంటాయని ఇప్పటికే ప్రకటన చేసిన సిఎం చంద్రబాబు,మంత్రి నారాలోకేశ్ ఇప్పుడు ఇక మిగిలిన నామినేటెడ్ పదవులు చిత్తూరు,తిరుపతి జిల్లాల్లో ఎవరికి వస్తాయనేది ఊహించుకోలేకపోతున్నారు. మొన్నటికిమొన్న భర్తీచేసిన పలు కార్పొరేషన్ల చైర్మన్ల పదవులు తిరుపతి జిల్లాకు మొండిచేయే కనిపించింది. గత మూడునాలుగు దశాబ్దాలుగా పార్టీ కష్టకాలంలోనూ కష్టపడిన కేడర్ నేతలు, కార్యకర్తలు ఉన్నారు. 2024లో జనసేనపార్టీ, బిజెపితో కలసి టిడిపి కూటమిపార్టీలుగా ఏర్పడ్డాయి. ఉభయజిల్లాల్లో ఆ రెండు పార్టీలకు పెద్దగా నాయకులు లేరనే చెప్పుకోవచ్చు. తిరుపతిలో అప్పటి పరిస్థితుల్లో జనసేన పార్టీకి టిక్కెట్ ఖరారుచేసి చిత్తూరు నుండి శ్రీనివాసులును ఇక్కడ ఎమ్మెల్యేగా కూటమి తరపున గెలిపించారు. ఈ కీలక వ్యవహారంలో టిడిపి కేడర్ నేతలు, కార్యకర్తలు కష్టపడటంతోనే సాధ్యమైనదే అధిష్టానం గ్రహించింది. ఇప్పటి వరకు ప్రకటించిన పలు నామినేటెడ్ పదవుల్లో సొంత పార్టీలో ఎవరికీ దక్కకపోవడం అంతర్మథనంతో ఉన్నారు. టిటిడి బోర్డులో కూడా తిరుపతి నుండి బిజెపికి చెందిన భానుప్రకాష్‌రెడ్డికి రెండవసారి అవకాశం కల్పించారు. తుడ చైర్మన్‌గా చంద్రగిరి నియోజకవర్గం నేత దివాకర్‌రెడ్డికి ,అదే చంద్రగిరి నియోజకవర్గంనుండి కొట్టాలకు చెందిన చంద్రబాబు బంధువు అనిమిని రవినాయుడుకు శాప్ చైర్మన్‌గా, కుప్పంకు చెందిన పార్టీసీనియర్ నాయకుడు పిఎస్ మునిరత్నంకు ఆర్టీసి చైర్మన్‌గా, టిటిడి బోర్డులో వైద్యం శాంతారామ్‌కు సభ్యుడుగా , జనసేన పార్టీ నేత డాక్టర్ హరిప్రసాద్‌కు హస్త కళల కార్పొరేషన్ చైర్మన్‌గా, నరసింహాయాదవ్‌కు రాష్ట్రయాదవ సంఘం కార్పొరేషన్ చైర్మన్‌పదవిని కట్టబెట్టారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మకు పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా నేతలకు ఇప్పటికే పలు కీలక పదవులు ఇచ్చేయడంతో ఇప్పుడు మిగిలిన నామినేటెడ్ పదవులు కూడా పార్టీకి కష్టపడిన తిరుపతికి చెందిన టిడిపి కేడర్ నేతలకు దక్కుతుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నామినేటెడ్‌లో పలు కీలక పదవులు ఉన్నా ఎవరిని వరిస్తుందనేది ఊహించలేక పోతున్నారు. 13 నియోజకవర్గాల్లో ప్రాధాన్యత ఉన్న పార్టీ సీనియర్ నాయకులు ఉన్నారు. మరీ వీరిలో బాబు మదిలో అదృష్టవంతులు ఎవరనేది ఇంకా చర్చసాగుతోంది.

# టైల్స్ ఫ్యాక్టరీలో పేలుడు
## ఇద్దరు మృతి - ముగ్గురికి గాయాలు

శ్రీకాళహస్తిరూరల్,నవంబర్ 26 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి మండలం వెల్లంపాడు గ్రామం వద్ద నిర్వహిస్తున్న సోమన్ టైల్స్ ఫ్యాక్టరీలో సంభవించిన పేలుడు సంఘటనలో ఇద్దకు అక్కడికక్కడే మృతి చెందగా ప్యాక్టరీలోని ఇద్దరు కార్మికులతో పాటు బయట మేకలు మేపుకుంటున్న గ్రామానికి చెందిన మహిళ గాయపడినట్లు సమాచారం.ఈ సంఘటనతో వెల్లంపాడు గ్రామస్తులు ఉలిక్కి పడ్డారు. అధికారులు పరుగులు తీసారు. హృదయవిదారకమైన సంఘటనలో కూటి కోసం బతుకు జీవనం కోసం ఇక్కడకు వచ్చిన ఇద్దరు కార్మికుల తుది శ్వాస వదిలారు.డివైయస్‌పి నరసింహామూర్తి సంఘటన సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కాగా రూరల్ ఎస్ఐ నరసింహారావు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వెల్లంపాడు గ్రామంలో సోమని టైల్స్‌ను నిర్వహిస్తున్నారు.ఈ కంపెనీలో 450 మంది కార్మికులు పని చేస్తున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. ఇక్కడ టైల్స్‌ను తయారు చేసి దేశ విదేశాలకు ఎగుమతులు చేస్తారు. ఈ కంపెనీలో స్థానికులే కాకుండా దేశ నమలుమూలల నుంచి కార్మికులు వచ్చి పని చేస్తున్నారు. బుధవారం ఉదయం యథాప్రకారం పనులు ప్రారంభమయ్యాయి.ప్రయోజనిక్ గ్యాస్ ఖాళీ ట్యాంకును శుభ్రం చేస్తుండగా వత్తిడి ఎక్కువ కావటంతో పేలుడు సంఘటన చోటు చేసుకుంది. ఈ ధాటికి అక్కడే పనిచేస్తున్న చీరాలకు చెందిన పోతురాజు(30) ఒరిస్సాకు చెందిన పాండే(25)లు మంటలకు మృతి చెందారు.గాయాలపాలైన చంద్రగిరి మండలం రామిరెడ్డిగారి పల్లెకు చెందిన బాలాజి, ఒరిస్సాకు చెందిన రంజన్ నాయక్‌లను వెంకటగిరి ఆసుపత్రిలో అంబులెన్స్ ద్వారా తరలించి ప్రాథమిక చికిత్స అందించి పరిస్థితి ఆందోళన కరంగా ఉండటంతో తిరుపతి రుయాకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





మృతి చెందిన పాండే, పోతురాజు.



ఫ్యాక్టరీ

### ఎవ్వరిని ప్రవేశానికి అనుమతించని ప్యాక్టరీ

పల్లె వాతావరణంలో నిర్వహిస్తున్న ఫ్యాక్టరీలో మంటలు చెలరేగి ఇద్దరు వ్యక్తులు చనిపోగా ఇంకేం జరిగిందో తెలియని దుస్థితి చోటు చేసుకుంది.అయితే ఫ్యాక్టరీ మేనేజ్‌మెంట్ ఇక్కడ వైద్యసేవలందించుటకు వచ్చిన ఎంపేడు ప్రాథమిక ఆరోగ్యకేంద్ర సిబ్బందిని కూడా అనుమతించకపోటం గమనించదగ్గ విషయం. ఫ్యాక్టరీ లోపల ఇంకేం జరిగిందో తెలియక అధికారులు ప్రజలు ఆందోళన చెందారు.

### కార్మికుల భద్రత లేదు:

ఈ సందర్భంగా వామపక్ష పార్టీలు శివమెత్తాయి. సిపిఐ నియోజకవర్గ ఇన్‌చార్జి జనమాల గురవయ్య మాట్లాడుతూ ఫ్యాక్టరీ నిర్లక్ష్యం వల్ల కార్మికుల కుటుంబాలు ఒక్కొక్కరి రూ.25లక్షల నష్టపరిహారంతో పాటు ఆ కుటుంబాలకు ఉద్యోగవకాశాలు కల్పించాలని డిమాండ్ చేసారు.ప్యాక్టరీలో కార్మికుల భద్రత లేదన్నారు.ప్యాక్టరీలో కార్మికుల భద్రతకు సంబంధించిన చర్యలు తీసుకోవటం లేదని ఆరోపించారు.బూట్లు,హెల్మెట్లు,జాకెట్‌లు ఎందుకు అందించలేదని ప్రశ్నించారు. ఒక్కోసారిగా మంటలు రావటంతో ఇద్దరు ప్రాణాలు కోల్పోటంతో చనిపోయిన వారి కుటుంబాలు వీధి పాలయ్యాయన్నారు.అలాగే కార్మికులకు ఇన్సురెన్స్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేసారు. లేని పక్షంలో ఎపెద్ద ఎత్తున కార్మికుల పరిరక్షణకు ఆందోళనలు చేపడతామన్నారు.



## శాస్త్రోక్తంగా ప్రసన్న వేంకటేశ్వరునికి కల్యాణం

వడమాలపేట, నవంబరు 26 ప్రభాతవార్త:
అప్పలాయగుంటలో అభయహస్తంతో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారి కల్యాణం బుధవారం శాస్త్రోక్తంగా జరిగింది. వేకువ జామున సుప్రభాతసేవలో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు నిత్యకైంకర్యాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అలంకరణ అనంతరం భక్తులు సర్వదర్శనం చేసుకున్నారు. ఉదయం 11 గంటలకు ఉత్సవ మూర్తులను కల్యాణ మండపంలో కొలువుదీర్చారు. ఆలయ ప్రధాన అర్చకులు సూర్య కుమారాచార్యులు టీటీడీ లాంఛనాలతో శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణాన్ని జరిపించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ శ్రీవారు శ్రీదేవి, భూదేవి మెడలో మంగళ సూత్రాధారణ చేశారు. కల్యాణోత్సవం టికెట్లు తీసుకొన్న దంపతులు కల్యాణాన్ని తిలకించి పులకించారు.అధికారి వేణుగోపాల్, షరాబు రవీంద్ర, వేదపండితులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుపతిరూరల్లో వున్న చెరువులను
# కబ్జాదారుల నుండి కాపాడండి
### - తిరుపతి ఆర్డీఓకు సిపిఎం నాయకులు వినతి




తిరుపతిరూరల్, నవంబర్ 26 ప్రభాతవార్త:
తిరుపతిరూరల్ మండల పరిధిలో వున్న చెరువులు ఆక్రమణకు గురైతున్నాయని, అక్రమణదారుల నుంచి చెరువును రక్షించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేసారు. చెరువుల భూభాగాలను కాపాడాలని, అక్రమదారులపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం సిపిఎం నాయకులు తిరుపతి ఆర్డీఓను కలిసి వినతిపత్రం అందజేసారు.

### యోగిమల్లవరం ఎగువ మల్లమగుంట చెరువుపై అక్రమ నిర్మాణాలు

యోగిమల్లవరం ఎగువ మల్లమగుంట చెరువును కొంతమంది ఆక్రమించి ఇళ్లు నిర్మించుకొంటున్నారని, రెవెన్యూ అధికారులకు తెలిసిన పట్టించుకోవడం లేదని సిపిఎం నాయకులు జయచంద్ర, సుమన్‌లు వాపోయారు. ఆక్రమణలపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్ళినప్పటికి స్పందన లేదని, అధికార పార్టీకి చెందిన కొంతమంది వ్యక్తులు చెరువుభూములను కబ్జా చేస్తుంటే, అధికారులు వత్తాసు పలకడం దారుణమన్నారు.

### వేదాంతపురంలో రజకుల దోబీ ఘాటల్ ఆక్రమణ

తిరుపతిరూరల్ మండలం వేదాంతపురం గ్రామ లెక్కదాఖలలో రజకుల దోబీ ఘాట్‌ను ఆక్రమించి, అక్రమ నిర్మాణాలు చేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. తిరుపతిరూరల్ మండలంలో జరుగుతున్న ప్రభుత్వ భూముల ఆక్రమణలపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితం మాత్రం శూన్యం అన్నారు.

### అధికార పార్టీకే అండ...

భూ ఆక్రమణలకు సంబంధించి అధికార పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు అండగా నిలుస్తున్నారన్న ఆరోఫణలు సిపిఎం నాయకులు వెల్లడించారు. రాజకీయ ప్రభావంతో చెరువుల భూములను, రజకుల దోబీఘాట్‌లను ఆక్రమిస్తున్నారని ఆరోఫించారు. చెరువులను ఆక్రమించిన వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేసారు.

## రోడ్డు విస్తరణ పనులకు
# కలెక్టర్, ఎమ్మెల్యే భూమి పూజ



చిత్తూరురూరల్, నవంబరు 26 ప్రభాతవార్త:
అద్భుత, అందమైన చిత్తూరు నగరం కోసం ప్రతి ఒక్కరు ముందుకు రావాలనీ, రోడ్లు బాగుంటేనే నగరం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ తెలిపారు. గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్, డిసిసిబి చైర్మెన్ ఆమాస రాజశేఖరరెడ్డి, మేయర్ ఎస్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత తదితరులతో కలసి నగరంలోని కొంగారెడ్డిపల్లి, పలమనేరు రోడ్ల విస్తరణ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేసారు. మొదటగా కొంగారెడ్డిపల్లె డిసిసిబి బ్యాంకు ప్రహరీ నిర్మాణానికి పూజ నిర్వహించిననంతరం రోడ్డు విస్తరణ కోసం అడిగిన వెంటనే బ్యాంకు స్థలాన్ని కొంత ఇవ్వడమే కాకుండా ప్రహరీని లోపల వైపు సొంతనిధులతో నిర్మించుకొనేందుకు అంగీకరించిన డిసిసిబి చైర్మెన్ ఆమాసరాజశేఖరరెడ్డికి ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు.అలాగే పలమనేరు రోడ్డువిస్తరణ పనులకు పశువైద్యశాల అవరణం, పోలీస్‌స్టేషన్ వద్ద, కన్నన్ కళాశాల ఆవరణంలో కలెక్టర్‌తో కలసి పూజలు చేసి పనులను ప్రారంభించారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల యాజమాన్యాలు రోడ్లవిస్తరణకు సహకరించాలన్నారు. ఇరువారం, దర్గా సర్కిల్ వద్ద పశువైద్యశాల, 2వ పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణాలను పరిశీలించి రోడ్డు విస్తరణకు అవసరమైన స్థలాన్ని గుర్తించి వేగంగా పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. కమీషనరు నరసింహప్రసాద్, ఏసిపి నాగేంద్ర, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బిఎన్ రాజసింహులు, తెదేపా పరిశీలకులు సునీల్‌కుమార్, నాయకులు సురేంద్రకుమార్, కాజూరు బాలాజీ, నగర అధ్యక్షుడు నరేష్, ప్రధాన కార్యదర్శి పచ్చప్ప, ఉపాధ్యక్షులు వరలక్ష్మి, మహిళావిభాగం సభ్యులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

## ఘనంగా 76వ భారత రాజ్యాంగ దినోత్సవం



తిరుపతి, కలెక్టరేట్ నవంబర్ 26 :
76 వ భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా తిరుపతి జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు, దేవేంద్ర రెడ్డి, రోజ్ మాండ్ లతో కలిసి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయ సిబ్బందితో కలిసి రాజ్యాంగ విలువలను ఆచరణలో పెట్టడంపై నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సంబందిత అధికారులు మరియు కల్లెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## యస్వీయూలో అంబేద్కర్‌కు ఘన నివాళులు



తిరుపతి విద్య, నవంబర్ 26 ప్రభాతవార్త:
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రాంగణంలో భారత రాజ్యాంగ నిర్మాత , భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌కు యస్వీయూ అధికారులు ఘనంగా నివాళులు అర్పిస్తూ, రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు.యస్వీయూ ఉపకులపతి ఆచార్య టాటా నరసింగరావు అడ్మినిస్ట్రేటివ్ భవనం ముందు ,విశ్వవిద్యాలయ లైబ్రరీలో డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య సిహెచ్. అప్పారావు,రిజిస్ట్రార్ ఆచార్య ఎం.భూపతి నాయుడు,ప్రిన్సిపాల్స్ ఆచార్య పద్మావతి, ఆచార్య కె.సుధారాణి, ఆచార్య ఎం. వెంకటేశ్వర్లు, డీన్లు,లైబ్రేరియన్ ఆచార్య సురేంద్రబాబు అధ్యాపకులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## టిప్పర్‌ను ఢీకొన్న కారు-బ్యాంక్ ఉద్యోగి దుర్మరణం



గంగవరం, నవంబరు 26, ప్రభాతవార్త :
కారు టిప్పర్‌ను డీకొన్న ప్రమాదంలో బ్యాంక్ ఉద్యోగి దుర్మరణం చెందిన సంఘటన బుధవారం మండ లంలో చోటు చేసుకుంది.గంగవరం అర్బన్ సిఐ ప్రసాద్ కథనం మేరకు వివరాలిలా..బంగారుపాళ్యం మండలం ఊటువంక గ్రామానికి చెందిన లోకనాథం కుమారుడు గోపినాథ్(35) పలమనేరు పట్టణంలోని ఓ ప్రైవేటు బ్యాంక్ నందు డిప్యూటీ మేనేజర్‌గా పని చేస్తూ గంగవరం పంచాయతీ సాయినగర్ సమీపంలోని హనుమాన్ వీధిలో నివాసం ఉంటున్నాడు.ఈ నేపథ్యంలో గోపినాథ్ పెద్దపంజాణి మండలం శంకరాయల్‌పేటలోని తన అత్తగారి ఇంటి నుండి కారులో బ్యాంక్‌కు వస్తుండగా మండలంలోని బైరెడ్డిపల్లె,పుంగనూరు రహదారిపై బాలేపల్లె సమీపంలో ఎదురుగా వస్తున్న ఎరువును తరలిస్తున్న టిప్పర్‌ను డీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది.ఈ ప్రమాదంలో కారులో ప్రమాణిస్తున్న గోపినాథ్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. విషయం తెలుసుకున్న సిఐ ప్రసాద్ సంఘటన స్థలాన్ని పరిశీలించి మృత దేహన్ని శవ పరీక్ష నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మృతుడి భార్య పూజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.మృతుడికి కుమారుడు, కుమార్తె సంతానం.

# ఆలయ అభివృద్ధికి సమిష్టిగా పనిచేయాలి
### -పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే దిశా నిర్దేశం

కాణిపాకం, నవంబర్ 26 ప్రభాతవార్త:
ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి ఆలయ సర్వతోముఖాభివృద్ధికి నూతన పాలకమండలి సమన్వయంతో పనిచేయాలని స్థానిక ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ అన్నారు. నూతనంగా ఏర్పాటైన పాలకమండలి ప్రమాణ స్వీకారం బుధవారం ఉదయం నిరాడంబరంగా జరిగింది. ఈసందర్భంగా స్థానిక ఈఓ కార్యాలయం సమావేశ మందిరంలో ఈఓ పెంచల కిషోర్ అధ్యక్షతన జరిగిన పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమంకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని వారి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఆయన మాట్లాడుతూ ఆలయ పాలకమండలి సభ్యత్వం కోసం ఎందరో పోటీ పడ్డారని తెలిపారు. ఈనేపథ్యంలో కాణిపాకం దేవస్థానం పాలకమండలి సభ్యులుగా నియమితులు కావడం మీరు చేసుకున్న పూర్వజన్మ సుకృతమన్నారు. ఆలయ పాలకమండలి తమ పదవీ కాలాన్ని దుర్వినియోగం చేయకుండా ఆలయ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కాణిపాకం ఆలయంలో ఉభయదారుల వ్యవస్థ వుందని, వారి గౌరవ మర్యాదలకు ఎటువంటి లోటు,భంగం కలుగకుండా పాలకమండలి నిర్ణయాలు తీసుకోవాలన్నారు.అలాగే పాలకమండలి పాలనా వ్యవహారాలపై తనతో చర్చించాలనుకుంటే ఎల్లప్పుడూ తాను సిద్దంగా వుంటానని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. ఈసందర్భంగా పాలక మండలి ఛైర్మన్ మణినాయుడు మాట్లాడుతూ ఆలయంపై తనకు స్పష్టమైన అవగాహన వుందని, స్థానిక ఎమ్మెల్యే మురళీమోహన్, ఆలయ అధికారులు, ఉభయదారులు, పాలకమండలి సభ్యులు,సిబ్బంది సహకారంతో ఆలయ సర్వతోముఖాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యంగా ఆలయ దర్శనార్థం వచ్చే భక్తులకు మెరుగైన సేవలందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.



### నిరాడంబరంగా ప్రమాణస్వీకారం

నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం బుధవారం నిరాడంబరంగా జరిగింది. సభ్యులుగా నియమితులైన 17 మందిలో 16 మంది సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. వీరు ముందుగా ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ఈఓ పెంచల కిషోర్ ఆధ్వర్యంలో ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం స్థానిక ఈఓ కార్యాలయం సమావేశ మందిరంలో సభ్యులుగా వి.సురేంద్రబాబు, అలియాస్ మణినాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ బివి.నరేష్, పరిమి చంద్రకళ, కెఎస్.అనుసూయమ్మ, కత్తి సుధాకర్‌రెడ్డి, సంధ్యారాణి, సునీత, కొత్తపల్లె శివప్రసాద్,నాగరాజు నాయుడు,శ్రీపతి సతీష్, పెరుమాళ్ సుబ్రమణ్యంరెడ్డి, చల్లా కృష్ణవేణి, పద్మలత, వసంత, వి.శ్రావణిలు పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. సభ్యులు మణినాయుడును ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన ఛైర్మన్ మణినాయుడు, సభ్యులకు పలువురు అభినందనలు తెలుపుతూ సత్కరించారు. ఆలయ ఈఓ పెంచల కిషోర్, ఈఈ వెంకట నారాయణ, ఆలయ ఏఈఓలు రవీంద్రబాబు,ప్రసాద్, ధనుంజయ, హరిమాధవరెడ్డి, సూపరెండెంట్‌లు వాసు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు, చిట్టిబాబు,స్థానిక నాయకులు, పాల్గొన్నారు.

# గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపాలి
### - ప్రభుత్వానికి వినతిపత్రంను మెయిల్ చేసిన ఎమ్మెల్యే పాశిం



గూడూరు, నవంబర్ 26, ప్రభాతవార్త
గత ప్రభుత్వం కఠినమైన నిర్ణయాలు తీసుకుని గూడూరును నెల్లూరు జిల్లా నుండి తిరుపతి జిల్లాలో కలిపిందని, దానివలన నియోజకవర్గం ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మా నియోజకవర్గానికి చెందిన చాలా మంది ప్రజలు, నెల్లూరు జిల్లా నుండి నియోజకవర్గాన్ని వేరు చేయడం మరియు తిరుపతిలో చేర్చడం వలన భౌగోళికంగా అన్యాయం, ప్రభుత్వ ప్రయోజనాల కోసం ప్రజలు తమ ప్రధాన కార్యాలయానికి వెళ్లడానికి అసౌకర్యంగా ఉందని భావిస్తున్నారని, గూడూరు చారిత్రాత్మకంగా ముఖ్యమైన పట్టణం, వాణిజ్యం, విద్య, సంస్కృతికి ముఖ్యమైన కేంద్రంగా పనిచేస్తోంది. ప్రస్తుతం, వారు అధికారిక పనుల కోసం తిరుపతికి 150 కి.మీ కంటే ఎక్కువ దూరం ప్రయాణించడంలో అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారని, వారు ప్రస్తుతం పరిపాలనా సమన్వయ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. గూడూరు చుట్టుపక్కల గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు కొత్తగా ఏర్పడిన తిరుపతి జిల్లా కంటే నెల్లూరుతో పరిపాలనా సౌలభ్యం మరియు చారిత్రక మరియు ఆర్థిక సంబంధాలను కోరుతున్నారని, అన్నారు.

## ప్రపంచానికి స్ఫూర్తి అంబేద్కర్ ఆశయాలు



**పుంగనూరు నవంబర్ 26 ప్రభాతవార్త** అంబేద్కర్ ఆశయాలు ప్రపంచానికే స్ఫూర్తిఅని, ఆయన ఆధ్వర్యంలో రచింపబడిన భారత రాజ్యాంగం పలు దేశాలకు దిక్సూచి అని శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. గిరిజన వృద్ధాశ్రమం నిర్వాహకులు బాణావతి మునేంద్ర నాయక్ తిరుపతి కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా పుంగనూరు శాసనసభ్యులు డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తిరుపతి ఎంపీ డాక్టర్ ఎం. గురుమూర్తి లు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు . ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా దళిత, గిరిజన నాయకులు మల్లారపు మధు, డాక్టర్ బాణావతి మునీంద్ర నాయక్, మస్తానమ్మ,నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు

## శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో విశేష పూజలు



**కల్లూరు, నవంబర్ 26, ప్రభాతవార్త** పులిచెర్ల మండలం కల్లూరు శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో మార్గశిర మాసం షష్ఠి సందర్భంగా ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు పూజలు జరిపారు. అనంతరం స్వామివారికి నైవేద్యం సమర్పించి మహా మంగళ హారతి గావించారు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ ప్రధాన అర్చకులు మల్లేష్ భరద్వాజ్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

## ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం



**సదుం నవంబర్ 26 ప్రభాతవార్త** సదంలోని వివిధ ప్రాంతాల్లో భారత రాజ్యాంగ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బి.ఆర్ అంబేద్కర్ భవనంలోను, సదంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ను, బీసీ గురుకుల పాఠశాలలోను రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన వకృత్వ మరియు క్విజ్ పోటీలను నిర్వహించారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సదుం జడ్పీ ఉన్నత పాఠశాలలో కబడ్డీ పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపికైన మహేంద్ర నాయుడును పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సన్మానించి 5000 రూపాయలు మరియు కబడ్డీ దుస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు సుబ్రహ్మణ్యం, పీడీలు భాస్కర్, నౌషద్ ఆలీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అంబేద్కర్ భవన్లో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వై వెంకటస్వామి, దళిత బహుజన నాయకుడు, పాత్రికేయుడు మల్లేపల్లి శ్రీనివాసులు, భారతీయ అంబేద్కర్ సేన పుంగనూరు నియోజకవర్గ అధ్యక్షుడు మందా సీతాపతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేవలను కొనియాడారు. విశ్రాంత ఉపాధ్యాయుడు రొద్దా వెంకటరమణ, రవి, మునెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో స్టాండ్‌ను ప్రారంభించిన పెద్దిరెడ్డి



**సదుం నవంబర్ 26 ప్రభాతవార్త** సదుం యర్రాతివారిపల్లి మార్గంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ పెద్దిరెడ్డి బుధవారం ఆటో స్టాండ్‌ను ప్రారంభించారు. సదుం ఎర్రతివారిపల్లె, సదుం నడిగడ్డ మార్గాలలో ప్రయాణికులు చేరవేస్తున్న ఆటోవాలా అందరూ కలిసి అయ్యప్ప ఆటో స్టాండ్ అని నామకరణం చేశారు . దీనికి సంబంధించిన బోర్డును ఆయన పూజలు చేసి ప్రారంభించారు. ప్రయాణికుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని, అదేవిధంగా నిబంధనలకు తగ్గట్టు రుసుములు వసూలు చేయాలని, ప్రయాణికులను వేధించరాదని ఆయన వారికి హితవు పలికారు.

## రైతు పక్షపాతి దేశం ప్రభుత్వం



**సోమల నవంబర్ 26 (ప్రభాతవార్త)** రైతుల అభ్యున్నతికి కృషి చేసే ప్రభుత్వం తెలుగుదేశం ప్రభుత్వం అని వల్లిగట్ల పంచాయతీ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు సాకి బండ విశ్వనాథ్ అన్నారు. వల్లిగట్ల పంచాయతీలో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు రైతులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వల్లిగట్ల గ్రామ కమిటీ అధ్యక్షుడు కృష్ణయ్య మాట్లాడుతూ రైతుల మేలు కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎంఈఓ జ్యోతి టిడిపి నాయకులు శేఖర్, రెడ్డప్ప, వెంకటరత్న మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు

## దేశం నేత ఆనందరెడ్డిచే పేదలకు అన్నదానం



**రామకుప్పం, నవంబర్ 26 ప్రభాతవార్త** టిడిపి మండల మాజీ అధ్యక్షుడు ఆనందరెడ్డి బుధవారం పేదలకు అన్నదానం జరిపారు. తన జన్మదినం సందర్భంగా 89 పెద్దూరు క్రాస్ వద్ద మూడు వందలమందికి అన్నదానం చేశారు. స్థానిక నేతలు ఆనందరెడ్డినిఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటరమణ, నేతలు ఆంజనేయరెడ్డి, రవిరెడ్డి, ఆదిల్, బాలరాజు, సుబ్రి, ఆదిల్, దయానంద పాల్గొన్నారు.

## ఘనంగా రాజ్యాంగదినోత్సవం

**రామకుప్పం, నవంబర్ 26 ప్రభాతవార్త** మండలంలో వాడవాడలా రాజ్యాంగ దినోత్సవాన్నిఘనంగా జరుపుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద డా॥ అంబేద్కర్ విగ్రహానికి కూటమి నేతలు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. గ్రీన్‌వ్యాలీ పబ్లిక్ స్కూల్‌లో అంబేద్కర్ చిత్రపటానికి పూజలు చేశారు. రాజ్యాంగం గొప్పదనం గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. నేతలు వెంకటరమణ, ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి, కామ రాజునాయక్, రఘు,రామలింగారెడ్డి, అవినాష్‌రెడ్డి, మంజునాథ్, రమేష్‌రెడ్డి, అలివేలుమంగమ్మ, పద్మమ్మ పాల్గొన్నారు.

## దళితవాడలో ఆర్డీఓ భవాని పర్యటన



**బైరెడ్డిపల్లి, నవంబర్ 26 ప్రభాతవార్త** మండలంలోని వెంగ ంవారిపల్లి, కైగల్ పంచాయతీలో బుధవారం ఆర్డీఓ భవాని పర్యటించారు. వెంగంవారిపల్లి దళిత వాడలో ఇంటి స్థలాలకు దారి సమస్య ఉండడంతో కాలనీ ప్రజలు చిత్తూరులో గ్రీవెన్స్ డే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాలతో ఆర్డీఓ భవాని గ్రామంలో పర్యటించి సమస్యను పరిశీలించారు. తగు చర్యలు తీసుకుంటామన్నారు. కైగల్‌లో రైతుల సమస్యలపై పొలాలు పరిశీలించి తగు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో తహశీల్దార్ ప్రసన్నకుమార్, ఆర్ఐ దాము, విఆర్వోలు, మండల సర్వేయర్ నరేష్ పాల్గొన్నారు.

## రెండు నెలలు చదివినా పూర్తిఫీజు కట్టాల్సిందేనా..?

- వి.కోటలో ఓ ప్రైవేట్ స్కూల్ నిర్వాకం !!

**వి.కోట, నవంబర్ 26 ప్రభాతవార్త** ఆరవ తరగతి ప్రైవేట్ స్కూల్‌లో చదివిన అనంతరం ఏడో తరగతి రెండు నెలలుమాత్రం వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో మరలా చేరితే ఆ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం ఏడాదికి సంబంధించిన ఫీజు మొత్తం చెల్లించాలని పేర్కొనడంతో బాధిత తండ్రి జిల్లా విద్యాశాఖాధికారి, ఎంఇఒలకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు అశోక్‌కుమార్ తెలిపిన మేరకు.. తనకు ముగ్గురు పిల్లలని వారిలో ఓ పాప ఐదో తరగతి దాకా ప్రభుత్వ పాఠశాలలో చదవగా ఆరవ తరగతి నిమిత్తం వి.కోటలోని నలంద స్కూల్‌లో చేర్చామన్నారు. పూర్తి ఫీజు కట్టేశామన్నాడు. అయితే ఏడో తరగతి రెండు నెలలు తన కుమార్తె చదవగా ప్రభుత్వ పాఠశాలలో సీటు రావడంతో అక్కడకు చేర్పించామన్నారు. అయితే నలంద యాజమాన్యం ఏడవ తరగతి ఫీజు మొత్తం చెల్లించాలని పేర్కొంటున్నారని వాపోయాడు.

## భారత రాజ్యాంగం భారతీయుల ఆత్మ స్వరూపం



**తిరుపతి విద్య, నవంబర్ 26 ప్రభాతవార్త:** శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని ప్రిన్సిపాల్ సి. ప్రకాష్ బాబు, అధ్యాపకులు, విద్యార్థుల చేత పీఠిక ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ,భిన్నత్వంలో ఏకత్వాన్ని నిలుపుకుంటూ,ప్రపంచములోనే విశిష్టమైన రాజ్యాంగంగా గుర్తింపు పొందిందన్నారు. కార్యక్రమంలో, అధ్యాపకులు, పి. ప్రియవర్ధన బాబు, డా. సి.ఎల్. చెన్నా రెడ్డి, కె. కృష్ణ కిషోర్, డా. పి. ప్రసాద్, ఈ. లోకేష్ రెడ్డి, పి.జి. లావణ్య, సి. రేవతి, డా. వి. ప్రసన్న లక్ష్మి, ఎస్. చంద్రికా భాయి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగ క్రీడాకారుల జిల్లా స్థాయి క్రీడాపోటీలు

**తిరుపతి క్రీడ, నవంబర్ 26, ప్రభాతవార్త** డిసెంబర్ 3న జరగనున్న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగ క్రీడాకారుల కోసం జిల్లా స్థాయి క్రీడా పోటీలు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు అధికారి శశిధర్ తెలిపారు. ఈ పోటీలను తిరుపతి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఎస్.వి. యూనివర్సిటీ స్టేడియంలో నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దివ్యాంగులకు 1. బ్యాడ్మింటన్ 2. చెస్,3. అథ్లెటిక్స్ 100 మీటర్లు, 200 మీటర్లు, లాంగ్ జంప్, షాట్ పుట్, 4.వాలీబాల్ పోటీలు నిర్వహించామని జిల్లా క్రీడా అధికారి వి. శశిధర్ తెలిపారు. సుమారు 27 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలను డిఎస్ఏ, శిక్షకులు లక్ష్మి, కరుణ, గోపి, హిందూజా, వినోద్, ఆది, ప్రేమ్ నాథ్, దయాజ్, నాగరాజు, నాని. విజయ్. అశోక్‌లు నిర్వహించారు.

## కుప్పంలో భగవద్గీత కంఠస్థ పోటీలు

**కుప్పం, నవంబర్ 26 ప్రభాతవార్త** గీతాజయంతిని పురస్కరించుకుని డిసెంబర్ 1న స్థానిక సుజ్ఞానంద ఆశ్రమంలో భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నట్లు శ్రీ ప్రజ్ఞానానంద సరస్వతి తెలిపారు. బుధవారం స్థానిక ఆశ్రమంలో పోటీల వివరాలు తెలియజేశారు. 3–8,9–14–15–21 ఏళ్ల ఆపై వయసు వారికి పోటీలు నిర్వహించి నగదుబహుమతులు అందిస్తామన్నారు. దరఖాస్తులకు గురువారం చివరి తేది అని తెలిపారు. వివరాలకు9963986620,9000116740,9676124756నెంబర్లనుసంప్రదించాలనికోరారు .

## ఘనంగా రాజ్యాంగదినోత్సవ వేడుకలు



**కుప్పం, నవంబర్ 26 ప్రభాతవార్త** 76వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలను కుప్పంలో బుధవారం నియోజకవర్గ టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎల్లప్ప నేతృత్వంలోఘనంగా నిర్వహించారు. స్థానికడా॥ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. రాజ్యాంగం సిద్ధించి న తీరు గురించి వక్తలు వివరించారు. కార్యక్రమంలో కడ సభ్యుడు రాజ్‌కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, మాజీఎంపిపి డా॥ వెంకటేష్, కొత్తపేట ఇన్‌చార్జ్ అప్పు, దళిత, గిరిజన నేతలు క ందస్వామి, రవి నాయక్, గణపతి, బాలాజీ,మునెప్ప, నాగభూషణ ం స్థానిక నేతలు పాల్గొన్నారు.

**సామగుట్టపల్లిలో :** 76వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలను సామగుట్టపల్లి జడ్పీహైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రాజ్యాంగ నిర్మాత డా॥ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూజలు చేశారు. రాజ్యాంగం యొక్క గొప్పతనాన్ని విద్యార్థులకువివరించారు. ఉపాధ్యాయులు గాలి సురేష్ పాల్గొన్నారు.

## రైతులు ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకోవాలి



**కుప్పం, నవంబర్ 26 ప్రభాతవార్త** కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ, పథకాలు రాయితీలపై రైతులు అవగాహన పెంచుకోవాలని టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్ కోరారు. బుధవారం మండలంలోని మల్లానూరు, అడవిబూదుగూరులో రైతన్నా..మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈసందర్భంగా ఇంటింటికి వెళ్లి రైతులకు పంచసూత్రాల కార్యక్రమంపై కరపత్రాలు పంపిణీ చేవారు. రానున్న ఐదేళ్లలో ఐదువిధానాలతో ఈ కార్యక్రమం రూపకల్పన చేశారన్నారు. నీటిభద్రత, డిమాండ్ ఆధారిత పంటలసాగు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వంనుంచి మద్దతు ధర కల్పన లక్ష్యాలతో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి సాంబశివ , కడ సభ్యుడు రామచంద్ర, రాష్ట్ర డైరెక్టర్లు మణి, శరవణ, యూత్ అధ్యక్షుడు కనకరాజఉ, నేతలు శ్రీనివాసులు,విభూషణ్, గాయత్రి, మోహన్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## కెడిసిలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



**కుప్పం, నవంబర్ 26 ప్రభాతవార్త** కుప్పం డిగ్రీ కాలేజ్‌లో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కాలేజ్ వైస్‌చైర్మన్ సాగర్ రాజ్ మాట్లాడుతూ దేశ ప్రజల హక్కును కాపాడడంలో రాజ్యాంగానికి కీలకపాత్ర అనా న్నరు. భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగమన్నారు. అనంతరం ఎపి మోడల్ స్కూల్ నడిమూరులో విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధారాణి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అలిమ్కో శిబిరానికి 1250మంది హాజరు



**శాంతిపురం, నవంబర్ 26 ప్రభాతవార్త** కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు అలిమ్కో సంస్థ ద్వారా స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో నిర్వహించిన సహాయ పరికరాల శిబిరంకు విశేష స్పందన లభించింది. మొత్తం 1250మందిదాకా శిబిరంకు హాజరయ్యారు. వీరిలో పరికరాలకై 870మందికి సిఫార్సు చేశారు. ఎంపికైన వారికి నెలలోపు పరికరాలు అందిస్తామని ఎంపిడిఒ పిఆర్ కుమార్ తెలిపారు. ఈసందర్భంగా ప్రజలు ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబులకు కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు అక్కడే 76వ రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. సాంఘీక సంక్షేమశాఖ డిడి త్రివిక్రమ్, ఆర్డీఓ శ్రీనివాసులురాజు, తహశీల్దార్ ప్రకాష్‌బాబు, కార్మికబోర్డు సభ్యుడు విశ్వనాథనాయుడు, పిఎసిఎస్ అధ్యక్షుడు గోపాల్, నేతలు రాజేంద్ర, సుగుణమ్మ, శ్యామల, నాగరాజు, గజేంద్ర, మంజునాథ్, ఎపిఎం శ్రీనివాస్, ఎపిఒ రెడ్డెమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్‌షాక్‌తో కార్పొరేషన్ డైరెక్టర్ మృతి



**రామకుప్పం, నవంబర్ 26 ప్రభాతవార్త** రామకుప్పం మండలం వీర్నమలకు చెందిన రాష్ట్ర వన్నియకులక్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ భూపతి బుధవారం కుప్పం మండలం దేవరాజపురం గ్రామంలో విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. దేవరాజపురంలో నూతన గృహ ప్రవేశంకు గాను పందిర్లు వేస్తుండగా 11కెవి విద్యుత్ తీగలు తగిలిఅక్కడే భూపతి కుప్పకూలాడు. పార్టీలో ఈయన క్రియాశీలకంగా పనిచేయడంతో సిఎం చంద్రబాబునాయుడు అతని సేవలు గుర్తించి రాష్ట్రస్థాయిలో కార్పొరేషన్ డైరెక్టర్ పదవి అప్పగించారు. భూపతి ఆకస్మిక మరణం పట్ల ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా చైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు, దేశం శ్రేణులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

## ఘనంగా డిగ్రీ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవం



**వెదురుకుప్పం, నవంబర్ 26 ప్రభాతవార్త :** భారత రాజ్యాంగ దినోత్సవాన్ని వెదురుకుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నపూర్ణ శారద అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా డాక్టర్‌బిఆర్. అంబేద్కర్ చిత్రపటంకు పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడ ుతూ ఏటా నవంబర్ 26ను దేశ రాజ్యాంగాన్ని స్వీకరించిన చారిత్రక ఘట్టాన్ని స్మరించుకుంటూ నిర్వహిం చడం జరుగుతుందన్నారు. చివరగా అందరూ ఏకగ్రీవంగా రాజ్యాంగ పీఠికను పఠించిన దేశ సార్వభౌ మత్వాన్ని, సమగ్రతను పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. భారతం మిట్ట కూడలి వరకు విద్యార్థులతో అవగా హన ర్యాలీగా మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అధ్యాత్మిక చింతనతో మార్పు :

తెలుగు యువత నియోజకవర్గం అధ్యక్షుడు కిషన్ చంద్

**వెదురుకుప్పం, నవంబర్ 26 ప్రభాతవార్త :** అధ్యాత్మిక చింతన ద్వారా మనుష్యులలో మార్పు వస్తుందని తెలుగు యువత గంగాధర నెల్లూరు నియోజకవర్గం అధ్యక్షులు గురసాల కిషన్‌చంద్ పేర్కొన్నారు. మండల కేంద్రం సమీపంలోగల సిఆర్.కండిగగ్రామంలో అయ్యప్పస్వామి జ్యోతి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలో పాల్గొని మాట్లాడుతూ మండలం పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో దీక్ష తీసుకోవడం దైవానుగ్రహంతో పాటు మంచి ప్రవర్తన వస్తుందన్నారు. భక్తిశ్రద్ధలతో యాత్ర పూర్తి చేసుకుని దైవదర్శనం చేసుకోవాలని చెప్పారు. అనంతరం అయ్యప్పస్వాములకు అన్న ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం వాణిజ్య విభాగం అధ్యక్షులు బట్టే చాణిక్య ప్రతాప్, తెలుగు యువత నాయకులుభాష్యంసతీష్ నాయుడు,సుబ్రమణ్యం, యువ నాయకులు మురళీ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

## క్రీడాపోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న దివ్యాంగులు



**చిత్తూరురూరల్, నవంబరు 26 ప్రభాతవార్త:** జిల్లా క్రీడాప్రాధికార సంస్థ మెసానికల్ క్రీడా మైదానంలో గురువారం జిల్లాస్థాయిలో దివ్యాంగుల క్రీడాపోటీలను నిర్వహించగా విభిన్న ప్రతిభావంతులు ఉత్సాహంగా పాల్గొన్నారనీ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎ.బాలాజీ తెలిపారు. బాడ్మింటన్, చెస్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించి అందులో గెలుపొందిన క్రీడాకారులకు జిల్లా టూరిజం ఆఫీసరు నరేంద్ర చేతుల మీదుగా బహుమతుల ప్రధానం చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఏ కోచ్, ఎస్‌జిఎఫ్ఐ సెక్రటరీ శారద, సీనియర్ అసిస్టెంట్ రాజశేఖర్, పిడి లోకేష్‌లతో పాటు క్రీడాకారులు పాల్గొన్నారు.

## చట్టసభల పనితీరుపై విద్యార్థులకు అవగాహన



**చిత్తూరురూరల్, నవంబరు 26ప్రభాతవార్త:** చిత్తూరు నగరం, సంతపేటలోని బృందావన్ సీనియర్ సెకండరీ పాఠశాల నందు సోమవారం రాజ్యాంగ అవతరణ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ వేషధారణతో పాటు మంత్రులు, పార్లమెంటు సభ్యు లు, ప్రధానమంత్రి, పార్లమెంట్ స్పీకర్, ప్రతిపక్ష సభ్యులు వంటి పాత్రలు నిర్వహించి అబ్బురపరిచారు. ప్రస్తుత సామాజిక సమస్యలపై చర్చించడానికి, వారి అభిప్రాయాలు వ్యక్తం చేయడానికి ఇటువంటి కార్యక్రమంను విద్యార్థులచేత నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శైలజకుమారి, డైరెక్టరు ప్రియతేజలు తెలిపారు. పాఠశాల అధ్యాపక, అధ్యాపకేతరబృందం, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ డైరెక్టర్ మృతిపట్ల సిఎం విచారం

**కుప్పం, నవంబర్ 26 ప్రభాతవార్త** రామకుప్పం మండలం వీర్నమలకు చెందిన రాష్ట్ర వన్నియకులక్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ భూపతి మృతి పట్ల సిఎం చంద్రబాబునాయుడు విచారం వ్యక్తం చేశారు. పార్టీ వీరాభిమాని అయిన భూపతి విద్యుత్‌షాక్‌తో మృతి చెందడం బాధాకరమన్నారు. వార్డుసభ్యుడిగా, గ్రామ పార్టీ అధ్యక్షుడిగా భూపతి పార్టీకి సేవలు అందించారన్నారు. ఆయన ఆత్మకు శాంతికలగాలని ప్రార్థించారు. భూపతి కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అతని కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని సిఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## పుంగనూరు ప్రజలకు అభివృద్ధిని చేసి చూపిద్దాం



శాప్ చైర్మన్ రవినాయుడు

**చౌడేపల్లి, నవంబర్ 26 ప్రభాతవార్త** పుంగనూరు నియోజకవర్గంలోని ప్రజలకు అభివృద్ధి, సంక్షేమాన్ని చేసి చూపిద్దామని శాప్ చైర్మన్ రవినాయుడు అన్నారు. తేదేపా సంస్థాగత ఎన్నికల్లో భాగంగా చివరి అంకమైన మండల పార్టీ అధ్యక్షుడు, అనుబంధ కమిటీలను ఎన్నుకొనే ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా బోయకొండ భవానీనగర్, చౌడేపల్లి శ్రీలక్ష్మీశ్రీనివాసా కళ్యాణమండపాల్లో ఏర్పాటు చేసిన సభల్లో రవినాయుడు ప్రసంగిస్తూ గత ప్రభుత్వంలో నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పడిన ఇబ్బందులను దృష్టిలో వుంచుకొని రాబోయే కాలంలో అందరికీ సమన్యాయం చేస్తామన్నారు. ప్రజల కష్టసుఖాలపై నూతన కమిటీ సభ్యులు దృష్టి సారించాలి కానీ రాష్ట్ర కార్యాలయంలో వినతులు తీసుకొచ్చే సంస్కృతికి స్వస్తి పలకాలన్నారు. పార్టీలో విభేదాలు సృష్టించి రాత్రి రాజకీయాలు మానుకోవాలన్నారు. కెస్ఎస్‌లో ఖచ్చితంగా కమిటీ సభ్యులు ఉండాల్సిందేననీ, రాబోయే ఎలాంటి ఎన్నికల్లోనూ విజయం సాధించాలన్నారు. తేదేపా అధిష్టానం ఏదిచెపితే అదే చేయాల్సి వుంటుందన్నారు. తేదేపా సంస్థాగత ఎన్నికల్లో ఏకాభిప్రాయం కావాలన్నదే పార్టీ ఎజెండా అన్నారు. పోటీనే అనివార్యమైతే అధిష్టానం నిర్ణయమే తుది నిర్ణయమన్నారు. నియోజకవర్గంలో తేదేపా నాయకులు, కార్యకర్తలపై అక్రమంగా పోలీసు కేసులు బనాయించి వారిని ఇళ్ళకు దూరం చేశారనీ, అయితే కూటమి ప్రభుత్వం అలాంటి చర్యలకు దూరంగా వుందన్నారు. అనంతరం కమిటీలకు సంబం ధించిన నామినేషన్లను స్వీకరించారు. నియోజకవర్గ పరిశీలకులు అమరనాథ్‌రెడ్డి, అశోక్‌యాదవ్, మండల పరిశీలకులు నాగేశ్వర్‌నాయుడు, మహేష్‌యాదవ్, ప్రతాప్‌రాజు, ప్రభాకర్, శ్రీనివాసులు, రామకృష్ణ, గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి), మాదిరాజు లక్ష్మణరాజు(పతిరాజు), మాదిరాజు ప్రదీప్‌రాజు, ఆవుల రామ చంద్రయ్య, బోయకొండ సుబ్బు, మండలంలోని నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలలో పాల్గొన్నారు.

## దేశ దిశా నిర్దేశానికి రాజ్యాంగం దిక్సూచి



**చౌడేపల్లి, నవంబర్ 26 ప్రభాతవార్త** దేశ దిశా నిర్దేశానికి భారత రాజ్యాంగం దిక్సూచి లాంటిదని వైకాపా రాష్ట్ర విద్యార్థి విభాగ సంయుక్త కార్యదర్శి కళ్యాణ్ భరత్ అన్నారు. అంబేద్కర్ జాతికిచ్చిన 76వ రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా స్థానిక కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత అంబేద్కర్ భవనంలో బ్యాంకు రెడ్డెప్ప ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలేసి నివాళుల ర్పించారు. మండల వ్యాప్తంగాగల పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా జరుపుకొన్నారు. మండల పరిపాలనా భవనంలోని ఎంపిడిఓ, తహశీల్దార్ భవనాలందు అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలేసి ఘనంగా నివాళులర్పించారు. రాజ్యాంగంలో పొందుపరచిన వాటిపై అవగాహన కల్పించారు. గడ్డంవారిపల్లి ఎంపిటీసీ తొండా శ్రీరాములు, మల్లికార్జున, డిష్‌సూరి, నాగేంద్ర, చాంద్‌భాషా తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం



**చిత్తూరురూరల్, నవంబరు 26 ప్రభాతవార్త:** చిత్తూరుపట్టణం, ఎన్‌పి సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ రాజ్యాంగ దినోత్సవం అవగాహన కార్యక్రమంను కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ డా.జి.ఉషారాణి అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ యూనిట్, పొలిటికల్ సైన్స్ విభాగం సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసరు డా.ఎస్ షమ్స్ అక్తర్ మాట్లాడుతూ 1949 నవంబరు 26న భారత రాజ్యాంగంచే అమోదించబడి నేటికి 76 సంవత్సరాలు గడిచాయని, ఇటువంటి అవగాహన కార్యక్రమాలు భారతదేశం లాంటి ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రాముఖ్యతను, దాని విలువలను బలోపేతం చేయడానికి సహాయపడతాయన్నారు. అలాగే పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు శివశంకర్ మాట్లాడుతూ అంబేద్కర్ తదితర రాజ్యాంగ సభ్యుల కృషిని గుర్తించి వారికి గౌరవం ఇవ్వడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడు తాయన్నారు. అనంతరం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వక్తృత్వ పోటీలలో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులను అందజేసారు. ఈ కార్యక్రమంలో ఆర్థికశాస్త్ర విభాగ అధ్యాపకులు డా.వెంకటేశ్వర్లు, సురేష్, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ద్విచక్రవాహనంపై పర్యటిస్తున్న ఎమ్మెల్యే గురజాల



**చిత్తూరురూరల్, నవంబరు 26 ప్రభాతవార్త:** చిత్తూరు నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో స్వయంగా తెలుసుకొని తక్షణమే పరి ష్కార చర్యలు చేపట్టడం కోసం చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ ద్విచక్ర వాహనంలో సైతం పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం ఇరువారం నీవానది వద్దనున్న సప్లైఛానల్ పనుల పరిశీలనకు వెళ్లిన ఎమ్మెల్యే అక్కడకు కారు వెళ్లడానికి వీలుకాక పోవడంతో ద్విచక్రవాహనంలో తనే స్వయంగా నడుపుకొంటూ వెళ్లి పరిశీలించారు. విలాసవంతమైన కార్లలో కాకుండా, ద్విచక్రవాహనంపై తిరుగుతూ సామాన్యప్రజలతో మమేకమై వారి కష్టాలను దగ్గరగా తెలుసుకొనివెంటనేపరిష్కరిస్తున్నఎమ్మెల్యేకుప్రజలు కృతజ్ఞతలు తెలుపుతూ నీరాజనాలు పలుకుతున్నారు.

## రాజ్యాంగం పట్ల ప్రతి పౌరుడికి అవగాహన కలిగి వుండాలి



**తవణంపల్లె, నవంబర్ 26 ప్రభాతవార్త:** భారత రాజ్యాంగం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి వుండాలని పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమో హన్ అన్నారు. బుధవారం ఐరాల క్రాస్‌లోని శ్రీవినాయక విద్యామందిర్ పాఠశాలలో కరస్పాండెంట్ ఆర్.గణపతినాయుడు ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల అసెంబ్లీ హాల్‌లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్.అంబేద్కర్ చిత్రపటాన్ని వుంచి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులచే మాక్ అసెంబ్లీ నిర్వహిం చారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారానే ప్రతి ఒక్కరికి రాజకీయ, ఆర్థిక, సాంఘిక. సమానత్వం లభిస్తోందన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఆర్,గణపతినాయుడు, ఎంఈఓ హేమలత, బంగారుపాళ్యం ఏఎంసీ చైర్మన్ భాస్కర్‌నాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటేశ్వరచౌదరి, అరగొండ సింగిల విండో చైర్మన్ ఎ,రంజిత్‌రెడ్డి, టీడీపీ నాయకులు గోపి యాదవ్, మదుసూధన్‌రావు, దిలీప్‌లతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగం ప్రపంచానికి స్ఫూర్తి దాయకం

- ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం



**కుప్పం, నవంబర్ 26 ప్రభాతవార్త** రాజ్యాంగ నిర్మాత డా॥ బిఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం దేశంతో పాటు ప్రపంచానికి స్ఫూర్తి దాయకమని ఆర్టీసీవైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కంగుంది సచివాలయం వద్ద 76వ రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా డా॥ అంబేద్కర్ చిత్రపటానికి పిఎస్ఎం పూజ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చాక భారతీయుల్ని పాలించుకునేందుకు రాజ్యాంగాన్ని డా॥ అంబేద్కర్ రచించారన్నారు.ఆయన రచించిన భారత రాజ్యాంగం ప్రపంచానికి దిక్సూచి అని పేర్కొన్నారు. దేశంలో ఎన్నో కులాలు, మతాలు, జాతులు మనుగడ సాగిస్తున్నాయంటే అది రాజ్యాంగం గొప్పతనం అని పేర్కొన్నారు. మహత్తరమైన రాజ్యాంగాన్ని అందించిన డా॥ అంబేద్కర్ చిరస్మరణీయులని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్, కార్పొరేషన్ డైరెక్టర్ వేణు, నేతలు విసి మంజునాథ్, లోకేష్, మునాఫ్,తిరుపతి, షరీఫ్, నాగరాజు, కార్యదర్శి పాల్గొన్నారు.

## సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో షష్ఠి ప్రత్యేక పూజలు

సదుం, నవంబర్ 26 ప్రభాతవార్త

సదంలోని గార్గేయ నది ఒడ్డున వెలసిన శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారి ఆలయంలో బుధవారం షష్ఠి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామి వారికి వివిధ రకాలైన తైలాలతో, సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం రోజా పూలతో విశేషంగా అలంకరించారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు అర్చకులు ఘనంగా స్వాగతం పలికి పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. జడ్పిటిసి సోమశేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీ ధనంజయ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు కృష్ణారెడ్డి, కమ్మిరెడ్డి, మేస్త్రి రాజన్న, అబ్బా రెడ్డి , సాకేత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎంపిడిఓగా పులిరాంసింగ్

రామచంద్రాపురం,నవంబర్ 26ప్రభాతవార్త:

రామచంద్రాపురం మండలం ఎంపిడిఓగా పులిరాంసింగ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జి ఎంపిడిఓ శ్రీనివాసులు నుండి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. గతంలో కడపజిల్లా కమలాపురం వివిఎన్‌పాల్యం డిప్యూటీ ఎంపిడిఓగా పనిచేస్తూ పదోన్నతిపై ఆయన బుధవారం రామచంద్రాపురంకు వచ్చారు. ఎంపిడిఓ కార్యాలయం సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

# ఎపియస్‌ఆర్‌టి కార్మికుల ధర్నా



**శ్రీకాళహస్తి, నవంబర్ 26 ప్రభాతవార్త** ఆర్‌టిసి కార్మికుల సమస్యల సాధనకు బుధవారం తిరుపతి జిల్లా నేషనల్ మజ్దూర్‌యూనియన్ పిలుపు మేరకు శ్రీకాళహస్తి ఆర్‌టిసి డిపో వద్ద ధర్నా నిర్వహించారు. శ్రీకాళహస్తి డిపోలో సంఘం ఉపాధ్యక్షులు జేజి శేఖర్ సారథ్యంలో ఆందోళనలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను వివరిస్తూ డ్రైవర్లు, కండక్టర్ల అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయాలి, డిపిటిఓ మొండి వైఖరి నశించాలని, జిల్లాలోని అన్ని డిపోల్లో నూతన డ్యూటీ చార్జిలను వేయాలని గ్యారేజ్‌లో ఖాళీలను భర్తీ చేఆయాలనీ, అలాగే వన్‌బార్ నైన్ సర్క్యులర్‌ను జిల్లాలోని అన్ని డిపోల్లో అమలు చేయాలని డిమాండ్ చేసారు. లేకుండాఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఈ ఆందోళన కార్యక్రమాల్లో రీజినల్ నాయకులువైడి కుమార్, ఇపి రావు, ఎల్‌వికె రావు, అధ్యక్షుడు ఎంఎస్ సుబ్రమణ్యం, శివకుమార్, గణేష్, కుమార్ అనంద్, పియస్ ఖాన్, పిఎస్ నాయుడు, సురేష్, సుబ్రమణ్యం, రమేష్, అంకులయ్య, ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్యాలయం ఎదుట కాలువ పరిశుభ్రం



**తొట్టంబేడు, నవంబర్ 26 ప్రభాతవార్త** తొట్టంబేడు మండలంలోని తొట్టంబేడు పంచాయతీ కార్యాలయం ఎదుట చోటు చేసుకున్న సమస్యను స్పందించిన సర్పంచ్ వెంటనే పరిష్కరించారు. ఇక్కడ పంచాయతీ కార్యాలయం ఎదుట దుర్గంధంనే వార్త బుధవారం ప్రచురితమైంది. స్పందించిన సర్పంచ్ సుబ్బయ్య కాలువను పరిశుభ్రం చేసారు. ప్రజా సమస్యను చక్కగా అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించిన వార్తకు గ్రామ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

# మా స్థలాన్ని మాకు ఇప్పించండి



**తిరుపతి హెల్త్, నవంబర్ 26, ప్రభాతవార్త** చట్టబద్ధంగా కొనుగోలు చేసిన 3వేల 23 చదరపు అడుగుల స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకుని తమ స్థలాన్ని తమకు అప్పగించాలని పుత్తూరు మండలం, తిరుమల కుప్పం గ్రామానికి చెందిన ఎన్. గిరిధర్ సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్ నందు జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నారాయణవనం మండలం కళ్యాణపురం గ్రామ లెక్క దాఖల సర్వేనెంబర్ 49/3 నందు 3 వేల 23 చదరపు అడుగుల స్థలాన్ని 2023లో చట్ట ప్రకారం కేకే సతీష్ కుమార్ వద్ద కొనుగోలు చేయడం జరిగిందన్నారు. అనంతరం తమ దగ్గర ఉన్న డబ్బు తో పాటు, బ్యాంకు నుండి 70 లక్షల రూపాయలు లోన్ తీసుకుని ఒక చిన్న డైరీ యూనిట్‌ను స్థాపించామన్నారు. ఈ క్రమంలో రాజేష్ కుమారి అనే వ్యక్తులు అకస్మాత్తుగా వచ్చి తమ భూమిలో 12 చదరపు అడుగులు స్థలము వారిదని చెప్పడం ప్రారంభించారు. అయితే తాము ఆ స్థలాన్ని చట్టబద్ధంగా కొనుగోలు చేశామని దానికి సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు తమ వద్ద ఉన్నాయని చెబుతున్నా, వినకుండా దౌర్జన్యానికి దిగారని వాపోయారు. ఈ ఏడాది జనవరిలో 50 మంది వరకు గుండాలతో వచ్చి రాజకీయ నాయకుల పేర్లు వాడుతూ తమ స్థలాన్ని వారికి అప్పగించాలని బెదిరించారు అన్నారు. ఈ విషయంపై నారాయణవనం సిఐ కి ఫిర్యాదు చేసినా తమ కంప్లైంట్ తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై డి.ఎస్.పి కలుగచేసుకుని వారితో మాట్లాడినా రాజకీయ ఒత్తిడి వల్ల ఏమి చేయలేకపోయారని విచారం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు తమ స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుని, తమకు జరిగిన నష్టాన్ని భర్తీ చేసి, తమ స్థలాన్ని తమకు అప్పగించాలని చేతులెత్తి వేడుకున్నారు

# వెటర్నరీ విద్యార్థి ప్రతిభకు బహుమతి



**తిరుపతి విద్య, నవంబర్ 26 ప్రభాత వార్త:** నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అనిమల్ న్యూట్రిషన్ అండ్ ఫిజియాలజీ బెంగళూరు నందు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో తిరుపతి పశువైద్య కళాశాల విద్యార్థి నాస్వర్ ఖాన్ తన పరిశోధన ఆలోచన పత్రానికి బహుమతి లభించింది. ఆవులు, గేదెల నుంచి వెలువడే మీథేన్ వాయువు ఎన్ ఐ సహజ ఆహార పదార్థాలతో ఏఐ సాంకేతికత జోడించి తగ్గించు విధానానికి గాను బహుమతి లభించింది. ఈ యొక్క విజయం సాధించినందుకు విశ్వవిద్యాలయం డీన్ డా సురేష్ కుమార్, కళాశాల అసోసియేట్ డీన్ డా. జగపతి రామయ్య సహకరించిన ఆచార్యులు డాక్టర్ సుదీర్ ని అభినందించారు.

# ఎస్‌జిఎస్‌ఆర్ట్స్ కళాశాలలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



**తిరుపతి విద్య, నవంబర్ 26 ప్రభాతవార్త:** భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఎస్ జి ఎస్ ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థులకు భారత రాజ్యాంగం యొక్క ప్రాముఖ్యతను తెలియజేయడానికి అవగాహన సదస్సును నిర్వహించి విద్యార్థులచే ప్రతిజ్ఞను చేయించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.సత్యనారాయణ తెలియజేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మన దేశ రాజ్యాంగం ప్రజాస్వామ్యానికి పునాది అని 1930లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ సమావేశంలో పేర్కొన్న రాజ్యాంగ ఆవశ్యకత ప్రాథమిక హక్కులు ఎలా రూపొందించుకోవాలని విషయాంశాల చర్చల ఫలితాలు మొదలగు వాటి గురించి సుదీర్ఘంగా వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి సులోచన రాణి (ఎన్ ఎస్ ఎస్ పి ఓ), వైస్ ప్రిన్సిపల్ డి పరమేశ్వర, ఇ.విజయ భాస్కర్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ నరేష్, అశోక్, అధ్యాపకులు జే. కొండలరావు, డాక్టర్ ఎస్ అనిల్ కుమార్, చంద్రశేఖర్ ఆజాద్, రోమేశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ పూలే జాతీయ అవార్డు అందుకున్న తిప్పారెడ్డి



**తిరుపతి విద్య, నవంబర్ 26 ప్రభాతవార్త:**76వ రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని ఢిల్లీలోని ఆంధ్ర భవన్లో అంబేద్కర్ ఆడిటోరియంలో అంబేద్కర్ పూలే ఫౌండేషన్ నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీహార్ మాజీ ముఖ్యమంత్రి కేంద్ర సూక్ష్మ మధ్య భారీ పరిశ్రమల శాఖ మంత్రి జితిన్ రామ్ మాంజి చేతులమీదుగా డాక్టర్ అంబేద్కర్ గ్లోబల్ న్యాయ కళాశాల అధినేత డాక్టర్ తిప్పారెడ్డి ని రాజ్యాంగ దినోత్సవం రోజు అంబేద్కర్ పూలే జాతీయ అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా తిప్పారెడ్డి మాట్లాడుతూ ఫౌండేషన్ చైర్మన్ మాజీ మంత్రి పరసారత్నం నేను సమాజానికి చేసిన సేవలను గుర్తించి జాతీయ అవార్డుతో సత్కరించడం పూర్వజన్మ సుకృతమన్నారు.

# ఘనంగా అంబేద్కర్ లా కళాశాలలో 76వ రాజ్యాంగ దినోత్సవం

**తిరుపతి విద్య, నవంబర్ 26 ప్రభాత వార్త:** డాక్టర్ అంబేద్కర్ న్యాయ కళాశాలలో 76వ రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీ కృష్ణ దేవరాయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్ వి పుల్లారెడ్డి హాజరై మాట్లాడుతూ విద్యార్థులు భారత రాజ్యాంగం పట్ల అవగాహన పెంచుకోవాలని తెలిపారు. భవిష్యత్తులో మీరు ఉన్నత విద్యను అభ్యసించే సమయంలో భారత రాజ్యాంగం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. రాజ్యాంగ విలువలను, ప్రతిష్టను ప్రతి ఒక్కరూ గుర్తుకు తెచ్చుకోవాలని తెలిపారు. భారత రాజ్యాంగం యొక్క విలువలను దానిని కాపాడుకోవాల్సిన బాధ్యతలను గుర్తు చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బిజయ్ కుమార్ బెహరా మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు బాధ్యతల గురించి అందరూ తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం కళాశాలలో నిర్వహించిన వ్యాసరచన వక్తృత్వం పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రసాదం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రెసిడెంట్ శారదమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# శ్రీరామలో ప్రాంగణ ఎంపికలు



**తిరుపతి విద్య, నవంబర్ 26 ప్రభాతవార్త:** స్థానిక కరకంబాడి రోడ్ లో ఉన్న శ్రీరామ ఇంజనీరింగ్ కాలేజ్ లో ఆఖరి సంవత్సరం విద్యార్థులకు సన్నీ ఒప్పో టెక్ కంపెనీ ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలు కంపెనీ హెచ్.ఆర్ కావ్య ఆధ్వర్యంలో లో నిర్వహించి విద్యార్థులకు రాత పరీక్ష, టెక్నికల్, వ్యక్తిత్వ ఇంటర్వ్యూ చేసి 11 మంది విద్యార్థులను వార్షిక వేతనం 2.88లక్షలతో ఎంపిక చేసుకున్నారు. ఈ కార్యక్రమంని ఉద్దేశించి కళాశాల చైర్మన్ మన్నెం.రామిరెడ్డి మాట్లాడుతూ తమ దగ్గర చదివిన ప్రతి విద్యార్థి తమ కోర్స్ పూర్తి అయ్యే లోపు ఉద్యోగం పొందటానికి అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నాము అని తెలిపారు. తమ కళాశాల లో ప్లేస్మెంట్స్ జరుపుటకు విచ్చేసిన కంపెనీ ప్రతినిధులకు, యాజమాన్యంకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎంపికకళాశాల సెక్రటరీ మన్నెం.రామసుబ్బారెడ్డి, డైరెక్టర్, మన్నెం.అరవిందుకుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ డా.కె.జయచంద్ర, ప్లేస్మెంట్ ఆఫీసర్ టి.విష్ణువర్ధన్ రెడ్డి, కంపెనీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

**పాకాల, నవంబర్ 26, ప్రభాతవార్త**

పాకాల మండలం స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల నందు ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను బుధవారం జరుపుకున్నారు. ఈ కార్యక్రమంనకు ఇన్చార్జి ప్రిన్సిపాల్ పి. హరినాధ ఆచ్చారి అధ్యక్షతన కళాశాలలో రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా సమావేశాన్ని నిర్వహించి ప్రతిజ్ఞను విద్యార్థుల చేత పలికించారు. కళాశాల నుంచి విద్యార్థులు అధ్యాపకులు అధ్యాపకేత్రం సిబ్బంది ర్యాలీగా పాకాల లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి ఇన్చార్జి ప్రిన్సిపాల్ పి. హరినాధ ఆచ్చారి పూలమాలను వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో లైబ్రరియన్ గీతాంజలి, చెంగల్ రాజు ఎన్ ఎస్ఎస్ పిఓ ఏ మునిరాజా, చలమారెడ్డి, గిరిజ, బాలు, ఆనంద్, హరి శ్రీనివాస ప్రసాద్, సుభాషిని తదితర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోండి - సదాశివం

**పుత్తూరు రూరల్, నవంబరు 26 ప్రభాతవార్త:** రాష్ట్రంలో బీసీల సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు



సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ద్ధి కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం తెలిపారు. జీ కల్యాణ మండపంలో నాయిబ్రాహ్మణ ఆత్మీయ య అతిథిగా హాజరైన చైర్మన్ సదాశివం మాట్లాడుతూ పథకాలను ప్రవేశపెడుతోందని వాటిని సద్వినియోగం ల సెలూన్ సాపులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. చిత్తూరులో నాయిబ్రాహ్మణుల కమ్యూనిటీహాలు నిర్మాణానికి తోడ్పాటు అందించాలని, ఆదరణ పథకం కింద పనిముట్లు ఇవ్వాలని, కార్పొరేట్‌సెలూన్ షాపులను కట్టడి చేయాలని, నిరుపేద నాయిబ్రాహ్మణులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరుతూ చిత్తూరు నాయిబ్రాహ్మణ సేవా సంఘం చైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చిత్తూరు నాయిబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు ఆర్.జి.ప్రసాద్, కార్పొరేటర్లు సహదేవన్, శ్రీకాంత్, చిట్టిబాబు, రామూర్తి, రమేష్, వేణుగోపాల్, ఏ.మురళి, మణికాంత్, ధనశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



**పుత్తూరు రూరల్, నవంబరు 26 ప్రభాతవార్త:** పుత్తూరు అంబేద్కర్ ట్రస్టు భవన్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ దినాన్ని పురస్కరించుకుని పుత్తూరు అంబేద్కర్ సర్కిల్ బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొని మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగం భారత రాజ్యాంగం అని ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం కూడా భారత దేశమేనని అన్నారు. భారత రాజ్యాంగాన్ని బాబాసాహెబ్ అంబేద్కర్ రచించడంతోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, బడుగు, బలహీన వర్గాలకు హక్కులు దక్కాయని తెలిపారు. మహిళలకు ఓటు హక్కుతో పాటు ఆస్తుల్లో కూడా సమాన హక్కు ఇచ్చినటువంటి ఏకైక రాజ్యాంగం భారత రాజ్యాంగం అని కొనియాడారు. కార్యక్రమంలో అంబేద్కర్ ట్రస్టు భవన్ కార్యదర్శి అప్పరంజి, ట్రెజరర్ కుప్పయ్య, సబ్ రిజిస్టర్ సుబ్రహ్మణ్యం, రాజేంద్ర, హెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మహేష్, డా. గుణశేఖర్, టీచరు మావిలయ్య, నాగూర్, మునిరత్నం, గంగాధరం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 76వ రాజ్యాంగ దినోత్సవం వేడుకలు

**పుత్తూరు రూరల్, నవంబరు 26 ప్రభాతవార్త:** భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభమైన భారత రాజ్యాంగ విలువలను గుర్తు చేసుకోవాలని, రాజ్యాంగ విలువలను పాటించేందుకు అందరూ గట్టి సంకల్పం తీసుకోవాలని కె.సి.సరళ అన్నారు. బుధ వారం భారత రాజ్యాంగ 76వ దినోత్సవ వేడుకలు పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. అనంతరం కె.సి.సరళ, పైడి అంకయ్యలను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మన్యం నరసింహులు సన్మానించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ మన్యం నరసింహులు, వే ఫౌండేషన్ అధ్యక్షుడు పైడి అంకయ్య, ఏ.నాగేశ్వరరావు, బాబురావు, వరలక్ష్మి, వెంకటేశన్, గాయత్రి, శంకరరావు, గంగయ్య తదితర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పుత్తూరు మున్సిపాలిటీలో రైతన్నా...మీకోసం కార్యక్రమం ప్రారంభం

**పుత్తూరు రూరల్, నవంబరు 26 ప్రభాతవార్త:** నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదేశాల మేరకు పుత్తూరు మున్సిపాలిటీ 12వ వార్డు అమరం కండ్రిగలో రైతన్నా...మీ కోసం కార్యక్రమంలో భాగంగా ప్రతి రైతు ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి సందేశపత్రాన్ని అందజేశారు. రైతులకు కూటమి ప్రభుత్వం అందజేస్తున్న వ్యవసాయశాఖ పథకాలను వివరించి, రైతాంగం సమస్యలు తెలుసున్నారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి గోపికృష్ణ, శాఖమూరి, వ్యవసాయశాఖ ఏడీఏ లక్ష్మీదేవి, ఏవో కోదండయ్య, తిరుపతి అగ్రికల్చర్ రీసెర్చ్‌సెంటర్ డైరెక్టర్ సుమతి, ఏరువాక జిల్లా అధికారి ఏఆర్‌కే రావు, వీఏఈ మురళి, వీఏఎస్‌శ్రీదేవి, ఏహెచ్‌ఏపి.రామచంద్రారెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ అబ్దుల్, రైతులు పాల్గొన్నారు.

# సీతారాం పేటలో అన్నదాత సుఖీభవ



**శ్రీకాళహస్తిరూరల్, నవంబర్ 26 ప్రభాతవార్త** ఏర్పేడు మండలంలోని సీతారాంపేట గ్రామంలో బుధవారం శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సారథ్యంలో 'రైతన్న మీ కోసం' కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలను, పథకాలను గురించి వివరించారు. మండల పార్టీ అధ్యక్షుడు పేరం నాగరాజు నాయుడు సారథ్యంలో జరిగిన కార్యక్రమాల్లో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కకేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న అన్నదాత సుఖీభవ ఆర్థిక స్వాలంబనను వివరించారు. ఓ వైపు ఆర్థిక వెసులుబాటు మరోవైపు పంటల పరిరక్షణ, మంచి విత్తనాల సరఫరా, సాగునీటి వసతులు, పంటల విధానాలను వివరించారు. ఈ కార్యక్రమాల్లో ఎంఆర్ఓ భార్గవి, ఎంపిడిఓ సౌభాగ్యమ్మ, తెలుగుదేశం నాయకులు నైనారు పొన్నారావు, మోహన్ నాయుడు, బాబు నాయుడు, కేశనేని సుబ్రమణ్యం రవి నాయుడు, మహేష్‌రెడ్డి, రమణ, గునాయాదవ్, కృష్ణవేణి, మునెయ్య గోపాల్‌రెడ్డి, రాఘవేంద్ర మనోహార్ నాయుడు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# పేదలకు అన్నదానం.. బట్టలు పంపిణీ



**శ్రీకాళహస్తి, నవంబర్ 26 ప్రభాతవార్త** శ్రీకాళహస్తిలోని చెంచులక్ష్మీకాలనీ వాసులకు బుధవారం ద స్కూల్ కరస్పాండెంట్ జనార్ధనరావు బట్టలు పంపిణీ చేసారు. మధ్యాహ్నం కడుపు నిండా భోజనం వడ్డించారు. ఎస్ఎంఆర్ ఫౌండేషన్ చైర్మెన్, రైతు సేవా సమితి అధ్యక్షుడు మోహన్‌రావు తన ధర్మపత్ని కడప సుబ్బమ్మ 11వ వర్ధంతి సందర్భంగా పలు సామాజిక కార్యక్రమాలను ఉర్పాటు చేసారు. సుబ్బమ్మ ఉపాధ్యాయ వృత్తిలో సుమారు 40 సంవత్సరాలకు పైగా సేవలందించారన్నారు. ఎందరో ఉత్తమ విద్యార్థులను తీర్చి దిద్దారన్నారు. ప్రతి ఏడాది ఆమె మృతికి సంతాపంగా పేదలకు బట్టలు అందించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో జనార్ధన్‌రావు పవార్‌తో పాటు మోహన్‌రావు, ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొన్నారు.

# సిబ్బంది రాజ్యాంగవిలువలకు కట్టుబడి ఉండాలి

తిరుపతి రవాణ, నవంబర్ 26ప్రభాతవార్త:



రాజ్యాంగ విలువలు, పౌర హక్కులు స్వేచ్ఛ తదితర అంశాలకు ఉద్యోగులు కట్టుబడి పనిచేయాలని వక్తలు పేర్కొన్నారు. బుధవారం ఉదయం తిరుపతి ప్రజారవాణాసంస్థ కార్యాలయంలో రాజ్యాంగదినోత్సవం జరిగింది. భారతరాజ్యాంగం ఉపోద్ఘాతంతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సిఎంఇ టి.బాలాజీ, పర్సనల్ అధికారిణి పి.చాందిని ,పిఆర్ఓ బికె రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు. అందరిచేత రాజ్యాంగం విలువలపై ప్రమాణం చేయించారు.

# కాంగ్రెస్ సారధ్యంలో రాజ్యాంగ దినోత్సవం



**శ్రీకాళహస్తి, నవంబర్ 26 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి కాంగ్రెస్ సారధ్యంలో రాజ్యాంగ దినోత్సవం సంద ర్భంగా సంబరాలు జరుపుకున్నారు. బుధవారం నియో జకవర్గ ఇన్‌చార్జి తలపా దామోదర్‌రెడ్డి సారధ్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు ముఖ్యఅతిథులుగా ఎపిసిసి పరిశీలకులు ఎంపి సుధారామకృష్ణ హాజరై ఆర్టిసి బస్టాండు వద్ద గల డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి సంబరాలు జరుపుకున్నారు. సుధారామకృష్ణన్ మాట్లాడుతూ భారత దేశ పౌరులకు సమాన హక్కుల కల్పనకై బడుగు బలహీన వర్గాల వారు అభివృద్ధి చెందాలంటే రిజర్వేషన్లు ద్వారా సాధ్యమౌతుందని వారి ఆర్థిక స్వాలంబన పొందాలని రాజ్యాంగాన్ని రచించి మేలు చేసారన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్, పిసిపి పరిశీలకులు మదనమోహన్, ప్రధాన కార్యదర్శి కలిందర్ తదితరులు పాల్గొన్నారు.



# దేశం నాయకునికి పరామర్శ:

**శ్రీకాళహస్తి, నవంబర్ 26 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి పట్టణంలోని తెలుగుదేశం యువ నాయకుడు లక్కమనేని మధు మాతృమూర్తి సావిత్రమ్మ మృతి చెందారు విషయం తెలుసుకున్న శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుదీర్‌రెడ్డి తెలుగుదేశం నాయకులు మృతదేహానికి నివాళులర్పించారు. మధును ఓదార్చారు. ఆయనతో పాటు శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్, శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు, రావిళ్ళ మునిరాజానాయుడు, గాజుల సత్యనారాయణ తదితరులున్నారు. కాగా ఆమె మృతికి పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు నివాళులర్పించారు.

# దళిత సంఘాల సారధ్యంలో రాజ్యాంగ దినోత్సవం



**శ్రీకాళహస్తి, నవంబర్ 26 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి లోని దళిత సంఘాల సారధ్యంలో బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఎపి ఆర్‌టిసి సర్కిల్‌లోని డాక్టర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా శ్రీకాళహ స్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్అ ంజూరు తారక శ్రీనివాసులు హాజరై రాజ్యాంగ దినోత్సవం గురించి రాజ్యాంగం దళితులకు కల్పించిన అవకాశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమాల్లో ఆయనతో పాటు చింతా రాజేంద్ర, కోగిల సుబ్రమణ్యం పసల కృష్ణయ్య, కమలాహార్, రామచంద్రయ్య, నాగరాజు, గోవర్ధన్ డానిల్ గిరి, అనంద్‌బోనుపల్లి నాగరాజు, బాబు, బాలకృష్ణయ్య, రమేష్, ధర్మయ్య గంగయ్య, రామమూర్తి, వెంకట కృష్ణయ్య, పఠాన్ ఫరీద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతకు తోడుగా రైతన్న మీకోసం

**భాకరాపేట, నవంబర్ 26, ప్రభాతవార్త** రైతులకు వున్నా సమస్యలను పరిష్కారం చూపుటకే ముఖ్యమంత్రి చంద్రబాబు రైతన్న మీకోసం కార్యక్రమం పెట్టారని తిప్పిరెడ్డిగారిపల్లి మాజీ సర్పంచ్ అనంత చంద్రశేఖర్ తెలిపారు. అయన ఉదయాన్నే తన గ్రామంలో రైతులతో మాట్లాడుతూ మీకు ఏ సమస్యలు వున్నా అధికారులు అందుబాటులో ఉంటారని తమ పంటలు పరిశీలించి తగిన సలహాలు ఇస్తారని తెలిపారు ఈ కార్యక్రమం లో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

# తిరుపతి డివిజన్

# ప్రతి విద్యార్థి పురోభివృద్ధి సుఖి విద్యను అభ్యసించాలి



**కేవీబీ పురం, నవంబరు 26 ప్రభాతవార్త:** ప్రతి విద్యార్థి విజ్ఞానవంతమైన విద్యను అభ్యసించి పురోభివృద్ధి సుఖ విద్య అభ్యసించాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. మండల కేంద్రమైన కేవీబీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులచే జానపద గీతాలు పాడించి వినిపించారు. ఆయన మాట్లాడుతూ వేమన పద్యాలతో నీతి నియమాలు కలిగినటువంటి పద్యాలలో కొన్ని నీతులను బోధించారని తెలిపారు. మంచి క్రమశిక్షణ కలిగి ఉండాలని విద్యార్థులకు మంచి మేలుకువలను బోధించాలని ఆయన పదో తరగతిలో క్లాస్‌లో నిర్వహించారు. ఎమ్మెల్యేను విద్యార్థులు మాకు సాంఘిక సంక్షేమ ప్రభుత్వ ఎస్సీ బాలుర హాస్టల్‌ని పునఃప్రారంభిస్తే సుమారు 200 నుంచి 300 మంది పిల్లలు హాస్టల్‌లో విద్యాబోధన సదుపాయాలు బాగుంటాయని ఎమ్మెల్యేని నిలదీశారు. ఆ హాస్టల్‌ని ప్రారంభించే విధంగా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే విద్యార్థులకు హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యేతో పాటు విద్యాశాఖ అధికారి లక్ష్మీపతి, రోశయ్య, ఎంపీడీవో మాలతి, పాఠశాల ఇన్‌చార్జి ఉపాధ్యాయులు విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. ఎమ్మెల్యేని పాఠశాల ఉపాధ్యాయులు శాలువలతో ఘనంగా సన్మానించారు.

***సచివాలయాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే***

మండల కేంద్రమైన కేవీబీ పురం సచివాలయంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తనిఖీలు నిర్వహించారు. సచివాలయంలో ఎవరు లేకపోవడంతో సిబ్బందిపై మండి పడ్డారు. అదే విధంగా ఆధార్ సెంటర్‌ని ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆయన ఏపీఎంతో మాట్లాడుతూ నేను నిధులు మంజూరు చేయిస్తే ఇంత వరకు మీరు దీన్ని ప్రారంభానికి ఎందుకు తీసుకోలేదని, పెయింట్లు వేయలేదని మండి పడ్డారు. అనంతరం రైతు విభాగ కార్యాలయాన్ని ఎమ్మెల్యే సందర్శించి అక్కడి రైతులకు ఎరువులు సక్రమంగా ఇస్తున్నారా లేదా...అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో ఎంపీడీవో మాలతి, తహసీల్దార్ రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

# కళత్తూరు ముంపు బాధితులకు వంట పాత్రలు పంపిణీ

**కేవీబీ పురం, నవంబరు 26 ప్రభాతవార్త:** మండలంలోని కళత్తూరు ముంపు బాధితులకు తిరుపతి రోటరీ క్లబ్, వేమన విజ్ఞాన కేంద్రం వారి ఆధ్వర్యంలో ఒకటిన్నర లక్ష విలువ చేసే వంట పాత్రలను 55 కుటుంబాలకు వంటి పాత్రలు కేవీబీ పురం హైస్కూలులో పంపిణీ చేశారు. వేమన విజ్ఞాన కేంద్రం ట్రస్టు కార్యదర్శి మల్లారపు నాగార్జున, రోటరీ క్లబ్ తిరుపతి కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, కోశాధికారి పురుషోత్తం, నాయకులు నడ్డి నారాయణ, టి.రవీంద్ర కుమార్, రోటరీ క్లబ్ రొటేరియన్స్ మార్కండేయ రెడ్డి, కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్, సీఐటీయూ మండల కార్యదర్శి నాగలాపురం నాగరాజు, వేమన విజ్ఞాన కేంద్రం సహాయకులు మోహన్ నాయుడు, స్థానిక యూత్ నాయకులు థామస్, రామ్‌కి, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు జ్ఞానమ్మ, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు సరళ, తదితరులు పాల్గొన్నారు.

# వ్యాసరచన, క్విజ్‌పోటీల్లో రెండవ స్థానం



**సత్యవేడు, నవంబరు 26 ప్రభాతవార్త:** భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని బుధవారం తిరుపతి తుడా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సత్యవేడు మండలం ఇరుగుళం జడ్పీ హైస్కూలులో చదువుతున్న విద్యార్థిని కౌషితకు జాయింట్ కలెక్టర్ మౌర్య ఆధ్వర్యంలో డీఈవో కుమార్ మెడల్, ప్రశంస పత్రాన్ని అందించారు. రాజ్యాంగ దినోత్సవంపై నవంబరు 1 తేదీ జరిగిన నియోజకవర్గ స్థాయి వ్యాసరచన, క్విజ్ పోటీల్లో ఇరుగుళం విద్యార్థిని కౌషిత రెండవ స్థానాన్ని సాధించింది. ఈ నేపథ్యంలోనే రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బుధవారం విద్యార్థిని కౌషిత జిల్లా ఉన్నతాధికారుల చేతుల మీదుగా ప్రశంసా పత్రం, మెడల్ అందుకుంది. కార్యక్రమంలో ఇరుగుళం ప్రధానోపాధ్యాయులు చినబాబు, విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ అధికారులపై అక్రమ కేసులు తొలగించండి

**సత్యవేడు, నవంబరు 26 ప్రభాతవార్త:** ఆర్టీసీ అధికారులు 1/2019 సర్క్యులర్‌ను తుంగలో తొక్కి ఆర్టీసీ ఉద్యోగులపై పెడుతున్న అక్రమ కేసులను వెంటనే తొలగించాలని ఎన్ఎంయూఏ డిపో అధ్యక్షుడు పార్థసారథి, రాష్ట్ర కార్యదర్శి చెంచులయ్య, సెక్రటరీ బాబు డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన 1/2019 సర్క్యులర్లు ఉన్నతాధికారులు పక్కదారి పట్టిస్తున్నారని, సర్కర్లు అమలు చేయడానికి బదులుగా ఉద్యోగులపై కఠినమైన ఆంక్షలు, వేధింపులు కొనసాగిస్తు న్నారన్నారు కార్యక్రమంలో ఎన్ఎంయూఏ స్టేట్ సెక్రటరీ ఎం.చెంచులయ్య, డిపో సెక్రటరీ వి.బాబు, డిపో ప్రెసిడెంట్ పార్థసారథి, డిపో గ్యారేజీ సెక్రటరీ ఎస్.శేఖర్, రీసన్ కమిటీ మెంబరు నరేష్, డిపో కమిటీ సభ్యులు, గ్యారేజీ కమిటీ సభ్యులు, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

# బ్రాహ్మణ జాతిపై విషం కక్కుతున్న వారిని అరెస్టు చేయాలి

***పుత్తూరు రూరల్, నవంబరు 26 ప్రభాతవార్త:*** బ్రాహ్మణులపై బ్రాహ్మణ జాతిపై అనుచితంగా దప్పు పాటలతో అవమాన పరుస్తున్న పల్లవోలు రమణ అలియాస్ జేడీ సారయ్య, వారి బృందంపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేదం హరిప్రసాద్ ఆరోపించారు. ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణులు ఎంతో పవిత్రంగా భావించి యజ్ఞోపవీతం మీద మా గాయత్రి మాత మీద అవమానపరుస్తూ దప్పు పాటలు పాడిన పల్లవోలు రమణ అలియాస్ జేడీ సారయ్య బృందంనీ అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని తిరుపతి జిల్లా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రెడ్డి ప్రకాష్, జిల్లా సంయుక్త కార్యదర్శి ముకుందాపురం మహేష్, పాతిబండ మురళీశర్మ, పుత్తూరు బాలాజీశర్మ, బాలాజీరావులు డిమాండ్ చేశారు. సమావేశంలో బ్రాహ్మణులు, పాల్గొన్నారు.

# ఐటిడిచే ఆధార్ కరెక్షన్ నమోదు

**తొట్టంబేడు, నవంబర్ 26 ప్రభాతవార్త** తొట్టంబేడు మండలం ఎంపిడిఓ కార్యాలయంలో ఐటిడిచే ఆధార్ మార్పుల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కంప్యూటర్ ఆపరేటర్ శశి బుధవారం తెలిపారు. చిన్నపిల్లలకు సంబంధించిన వేలి ముద్రలలో ఆధార్ కార్డులో మార్పులు చేర్పులు చేసుకోవచ్చునన్నారు. సుమారు ఏడు నెలల వ్యవధిలో 3వేల మందికి ఆధార్‌కార్డులను నమోదు చేసినట్లు శశి వివరించారు. డొమెసిటిక్ సర్టిఫేకట్లు ఉన్నవారికి ఉచితంగా సహాయం చేసినట్లు వివరించారు.

# గ్రామాల్లో సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపండి

రామచంద్రాపురం, నవంబర్ 26ప్రభాతవార్త:మండలంలోని అనేక గ్రామాల్లో ప్రజల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపిపి ఏవి బ్రహ్మానందరెడ్డి అధికారులకు ఆదేశించారు. బుధవారం ఎంపిడిఓ కార్యాలయంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో శాఖలవారీగా అధికారులు తమ ప్రగతి నివేదికలను సభకు చదివి వినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తుండటంతో గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వైద్యఆరోగ్య సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి సమస్య, పారిశుధ్యసమస్య ఉంటే తనదృష్టికి తీసుకురావాలని ఎంపిపి అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారానికి చొరవచూపాలన్నారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ केनरा बैंक Canara Bank
Syndicate
Together we can

**కుప్పం-1 శాఖ (ఎపి వజ్రవేలుశెట్టి వీధి, కుప్పం, చిత్తూరుజిల్లా - 517425)**

**స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)**

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002లోని రూల్3 తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలు వినియోగించు కుంటూ **కెనరా బ్యాంకు, కుప్పం-1 శాఖ వారి** యొక్క అధీకృత అధికారిగా ఉన్న దిగువ సంతకందారు నోటీసులో తెలిపిన మొత్తం **రూ. 37,82,396.31 పై (ముప్పై ఏడు లక్షల ఎనభై రెండు వేల మూడు వందల తొంభై ఆరు రూపాయల ముప్పై ఒక్క పైసలు మాత్రమే) మరియు తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులను** సదరు నోటీసు అందుకున్న తేదీ నుంచి 60 రోజుల్లో తిరిగి చెల్లించవలసినదిగా రుణగ్రహీత **మెస్సర్స్ శ్రీ వేంకటేశ్వర బ్రిక్స్, ప్రొప్రయిటర్ శ్రీ బి.భారథి, తండ్రి బి.శేఖర్, డి.నెం.3-35, మునస్వామిపురం, పాతపేట, కుప్పం, చిత్తూరుజిల్లా, ఆంధ్రప్రదేశ్ - 517425 మరియు గ్యారంటారు: టి.వెంకటేశ్ తండ్రి టి.తిమ్మప్ప (డి.నెం.1-94, చిన్నగొల్లపల్లి, గుడుపల్లి మండలం, చిత్తూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 517 425)** గారిని కోరుతూ **20.09.2025** వ తేదీ గల డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది.

రుణగ్రహీత సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, దిగువ సంతకందారు సదరు చట్టంలోని నిబంధన 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ తెలిపిన ఆస్తిని **26.11.2025వ తేదీన** స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీతకు, హామీదారులకు, సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

సదరు ఆస్తితో ఏ వ్యవహారం జరుపరాదని, ముఖ్యంగా రుణగ్రహీతను మరియు సాధారణ ప్రజలను ఇందుమూలముగా హెచ్చరించడమైనది మరియు సదరు ఆస్తితో ఏవేని వ్యవహారాలు జరుపదలిస్తే **కెనరా బ్యాంకు వారికి రూ.37,82,396.31పై (ముప్పై ఏడు లక్షల ఎనభై రెండు వేల మూడు వందల తొంభై రూపాయల ముప్పై ఒక్క పైసలు మాత్రమే)** మరియు దానిపై వడ్డీ మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, చార్జీలు మొదలైనవి చెల్లించుటకు లోబడి ఆ విధంగా చేయవచ్చును.

సెక్షన్ 13(8) క్రింద సెక్యూర్డ్ ఆస్తులను తిరిగి పొందేందుకు సమయం ఇవ్వడమైనదని రుణగ్రహీతలకు తెలియజేయడమైనది.

**స్థిరాస్తి వివరణ**

**దిగువ తెలిపిన ఆస్తులు అన్ని ఈజ్‌మెంటరీ హక్కులు మరియు అనుబంధాలతో శ్రీ ఎస్.భారది తండ్రి బి.శేఖర్ పేరున వున్నది.** చిత్తూరు రిజిస్ట్రేషన్ జిల్లా -కుప్పం సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా, కుప్పం మండలం, కమతమూరు గ్రామ పంచాయతీ, కమతమూరు రెవిన్యూ గ్రామం, సర్వేనెం.45/3,లోని ఖాళీ స్థలానికి కొలతలు: తూర్పు నుండి పడమర: ఉత్తరం వైపు: 35అ. (10.67మీ) మరియు దక్షిణం వైపు: 42అ. (12.80మీ.) ఉత్తరం నుండి దక్షిణం: తూర్పు వైపు 175అ. (53.34మీ.) మరియు పడమర వైపు: 194అ.(59.13మీ.) వెరశి 7103.25చ.అ. లేదా 789.25 చ.గ., హద్దులు: తూర్పు: ఎస్.రజనీకాంత్ ఖాళీ స్థలం, పడమర:ఎస్.భవాని& పద్మావతి ఖాళీ స్థలం, ఉత్తరం: పబ్లిక్ రోడ్డు, దక్షిణం: జి.వెంకటేష్ భూమి

స్థలం : కుప్పం — సం॥ అధీకృత అధికారి,
తేది : 26.11.2025 — కెనరా బ్యాంక్

## లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి

గూడూరు, నవంబర్ 26 ప్రభాతవార్త: కేంద్రంలో స్వదేశీ విదేశీయుల కార్పొరేట్ల కోసం పరిశ్రమల్లో మొత్తం భారతదేశ కార్మిక వర్గాన్ని బానిసల్లాగా మార్చే ఈ నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలన్నారు. రాజ్యాంగ విరుద్ధం, అప్రజా స్వామిక చర్య అని దీనిని భారత దేశ కార్మిక వర్గం అంగీకరించడానికి సిద్ధంగా లేదని,తిరుపతి జిల్లా గూడూరులో సి.ఐ.టి.యు, ఎ.ఐ.టి.యు.సి, ఎల్.ఐ.సి ప్రజాసంఘాల నాయకులు ఆధ్వర్యంలో బుధవారం కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాల నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో గూడూరు ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్, సి.పి.ఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సి.హెచ్. ప్రభాకర్, సి.ఐ.టి.యు నాయకులు బి.వి.రమణయ్య, పామంజి మణి, సి.పి.ఐ గూడూరు నియోజకవర్గ కార్యదర్శి నియోజకవర్గ కార్యదర్శి జి.శశి, ఏ.ఐ.టీ.యూ.సీ కె.నారాయణ, జి.రమేష్,సునీల్, కెవిపిఎస్ నాయకులు అడపాల ప్రసాద్, ఏంబేటి చంద్రయ్య, ఏకుల రమణయ్య, పి.సుబ్బయ్య, ఎల్.ఐ.సి నుండి బి. నరసింహారెడ్డి, ఎన్. శివకుమార్, పి.పి.వి. నాగరాజు, మున్సిపల్ సంఘం జిల్లా అధ్యక్షులు ధారా కోటేశ్వరరావు,ఆశా వర్కర్లు కె.ఉష, బి.పార్వతి, కె.జానకి, ఆటో నాయకులు బి.భాస్కర్‌రెడ్డి, డేవిడ్, భవన నిర్మాణ కార్మిక సంఘం సీనియర్ నాయకులు గండికోట మధు,ఎస్.డి.రఫీ,జిలాని, యన్.వెంకట రమణ, కె.మల్లీశ్వరయ్య, బి.చంద్రయ్య, అధిక సంఖ్యలో ప్రజలు అభిమానులు ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## కోటలో క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ శిక్షణ కార్యక్రమం



కోట, నవంబర్ 26 ప్రభాతవార్త : మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ శిక్షణ కార్యక్రమాన్ని ఎంపిడిఓ దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలోని అన్ని గ్రామైక్య సంఘాల ప్రెసిడెంట్లు, వైస్ ప్రెసిడెంట్లతో శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి వారికి వ్యక్తిగత, కుటుంబ, గ్రామ పరిశుభ్రతపై బాధ్యతాయుతంగా ఉండాలని అవగాహన కల్పించారు. పంచాయతీల్లో జరిగే పారిశుధ్య కార్యక్రమాల్లో భాగస్వామ్యం తీసుకోవాలని, తద్వారా కుటుంబ, గ్రామ ఆరోగ్యం, ఆదాయం పెంపొందించుకోవడం, ప్రకృతి పరిరక్షణ, కాలుష్య నివారణపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కె.జయజయరావు, తదితరులు పాల్గొన్నారు.

## 44వ జ్యోతి పూజోత్సవం బుక్‌లెట్ ఆవిష్కరణ





నాయుడుపేట రూరల్, నవంబర్ 26 ప్రభాతవార్త : పట్టణంలో శ్రీ అయ్యప్ప స్వామి సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీ అయ్యప్పస్వామి 44వ జ్యోతి పూజోత్సవ బుక్‌లెట్‌ను బుధవారం ఆవిష్కరించారు. శ్రీ అయ్యప్పస్వామి సేవాసంఘం అధ్యక్షులు కామిరెడ్డి రాజారెడ్డి మాట్లాడుతూ నాయుడుపేట పట్టణంలో గత 43 ఏళ్లగా వైభవంగా అయ్యప్ప స్వామి జ్యోతి పూజోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 44వజ్యోతి పూజోత్సవ కార్యక్రమాన్ని డిసెంబర్ 4, 5 తేదీల్లో వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తిశ్రద్ధలతో కేరళ తరహాలో నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భగవాన్ శ్రీ అయ్యప్పస్వామి సేవాసంఘం ఉపాధ్యక్షులు కనమర్లపూడి సుబ్రహ్మణ్యం, చిరువెళ్ల మునిరాజా, చిట్టేటి అంకయ్య, డిసి కిషోర్, కోశాధికారి జలదంకి వెంకటకృష్ణారెడ్డి, గౌరవ సలహాసభ్యులు పాపాడి చంద్రారెడ్డి, సిహెచ్ మునిప్రసాద్, డిసి యతీంద్ర, చదలవాడ కుమార్, శిరసనంబేటి కరుణాకర్‌రెడ్డి, గుండాల సురేష్‌రెడ్డి, కాలగంధ సునీల్, బిఎల్ శ్రీనివాసులు, గాదిరెడ్డి గోపీ, ఎం.జలంధర్ కుమార్, చిరువెళ్ల బాబ్జి, సభ్యులు పాల్గొన్నారు.

## లింగ వివక్షత రూపుమాపాలి

తడ, నవంబర్ 26 ప్రభాతవార్త: ప్రతి మహిళా చైతన్యం మార్పు కోసం ముందడుగు వెయ్యాలని లింగ వివక్షత తను రూపుమాపాలని తడ ఎంపీడీవో శేఖర్ నాయక్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా తడ మండల సమైక్య ఆధ్వర్యంలో మహిళా సదస్సు ర్యాలీ నిర్వహించారు. ఏపీఎం రాజారెడ్డి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా లింగ వివక్షత వ్యతిరేకంగా నవంబర్ 25వ తేదీ నుండి డిసెంబర్ 23వ తేదీ వరకు స్త్రీలపై వివక్షత వ్యతిరేకంగా ర్యాలీలు మహిళా సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. మండల ఎంపీపీ రఘు సీసీలు చంద్రయ్య జనార్ధన్ వెంకటేశ్వర్లు మురళి సమైక్య మహిళలు పాల్గొన్నారు.

## రేపే కోటలో ప్రజా దర్బార్

కోట,నవంబర్ 26 ప్రభాతవార్త: కోట మండల పరిషత్ కార్యాలయాంలో ఈనెల 28న ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడివో దిలిప్ కుమార్ తెలిపారు ఈ కార్యక్రమంకు గూడూరు శాసన సభ్యులు డాక్టర్,పాశం సునిల్ కుమార్ విచ్చేసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. మండల ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో తెలుపుకొచ్చాన్నారు.

## ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



గూడూరు, నవంబర్ 26 ప్రభాతవార్త : పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదుట ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎం.యు జోనల్ చీఫ్ అడ్వైజర్ ఎస్.కె అహ్మద్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పెండింగ్లో ఉన్న అన్ని డిపోలలో కండక్టర్లు, డ్రైవర్ల నూతన చార్టులను ప్రవేశపెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపో ప్రెసిడెంట్ ప్రవీణ్, రీజనల్ వైస్ ప్రెసిడెంట్ వెంకయ్య, అసిస్టెంట్ సెక్రటరీ శ్రావణ్ కుమార్,రీజినల్ జాయింట్ సెక్రెటరీ వెంకటేశ్వర్లు, డిపో చైర్మన్ భాష, బాబురావు, కృష్ణయ్య, హుస్సేన్,అంకయ్య, పోలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిజాయితీ చాటుకున్న ఆటో కార్మికుడు



చిల్లకూరు, నవంబర్ 26 ప్రభాతవార్త: మండల పరిధిలోని చింతవరం సి.ఐ.టి.యు ఆటో స్టాండ్ కార్మికుడి ఆటోలో కొత్తపాలెంకి చెందిన తంగారు సుబ్బమ్మ బాధితురాలు గూడూరుకు వచ్చేందుకు ఎక్కడంతో పక్కనే మరొక ఆటో రావడంతో ఎక్కిన ఆటో ఆలస్యం అవుతుందని బాధితురాలు మొదట ఎక్కిన ఆటోలోనే, నాలుగు సవర్ల బంగారు కడియం నాలుగు లక్షల విలువ చేసే వస్తువు ఉన్న సంచిని మరచి పోయి కంగారులో వేరే ఆటో ఎక్కి జరిగింది. సదరు అయ్యప్ప దీక్షలో ఉన్న ఆటో కార్మికుడు దారా శ్రీనివాసులు ఆ సంచిని గుర్తించి గూడూరులోని మార్కెట్ స్టాండ్ దగ్గరకి రావడం వెతికి తోటి ఆటో కార్మికులు అయిన బి.అంకయ్య, బల్లి.పెంచలయ్యల సహాయంతో వారిని గుర్తించి బంగారు కడియం ఉన్న సంచిని బాధితులకు అందజేసారు.

## ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



గూడూరు, నవంబర్ 26 ప్రభాతవార్త: పట్టణంలోని కోర్టులో రాజ్యాంగ దినోత్సవం, వరకట్న వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఏడవ అదనపు జిల్లా జడ్జి వెంకట నాగ పవన్ సబ్ జడ్జ్ సులోచనరాణి మరియు లాయర్లు కోర్టు సిబ్బంది అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు జడ్జ్ వెంకట నాగ భవన్ మాట్లాడుతూ దేశంలో ఎంతోమంది మేధావులు ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సమర్థుదని రాజ్యాంగాన్ని రూపొందించే అవకాశం కల్పించారని అన్నారు. ఈ కార్యక్రమంలో లాయర్లు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం



చిల్లకూరు, నవంబర్ 26 ప్రభాతవార్త: మండలంలోని వల్లిపేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో నారాయణ ఆరోగ్యమస్తు పథకం ద్వారా సుమారు కొన్ని వేల మందికి పైగా ఉచిత ఆపరేషన్లు మరియు వైద్య చికిత్సలు అందిస్తూ ప్రజల జీవితాలలో ఆరోగ్యం వెలుగులు నింపుతూ ఆంధ్రప్రదేశ్లో ప్రైవేటు రంగంలో ఎవ్వరికి సాధ్యం కానీ నాణ్యమైన వైద్యాన్ని ఉచితంగా అందిస్తూ అందరి యొక్క పిఆర్ఓఎన్ సురేంద్ర కుమార్ సూచనలతో వల్లిపేడు జడ్పీ హైస్కూల్ బండి మురళి ఉచిత వైద్య వైద్య సలహా శిబిరం బుధవారం ఉదయం నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వల్లిపేడు ఎమర్జెన్సీ డాక్టర్ దినేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్లు కీళ్ల ఎముకల వ్యాధి నిపుణులు చెవి, ముక్కు,గొంతు వ్యాధి నిపుణులు కంటి వ్యాధి నిపుణులు పాల్గొన్నారు.

## నరేంద్ర మోడి నాయకత్వంలో కార్మికులకు భద్రత

గూడూరు, నవంబర్ 26 ప్రభాతవార్త: పిఎం నరేంద్ర మోడి నాయకత్వంలో కార్మికులకు భద్రత అని బిజెపి మజ్దూర్ సంఘ్ అధ్యక్షులు నాలి మధుసూధన్ యాదవ్ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ పిఎం నరేంద్ర మోడీ కార్మికుల సంక్షమమే ధ్యేయంగా కార్మిక చట్టంలో తీసుకువచ్చిన మార్పులు కార్మికుల జీవన ప్రమాణాలు, వారి భవిష్యత్తుకు మరింత భద్రత చేకూరుతుందన్నారు. ఈ సవరించిన చట్టాల మీద భారతీయ జనతా మజ్దూర్ సంఘ్ జాతీయ అధ్యక్షులు షాన్త్ ప్రకాశ్ జాటవ్, భారతీయ జనతా మజ్దూర్ సంఘ్ నాయకులకు, కార్మికులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తూ కార్మికులకు అవగాహన కల్పిస్తున్న జాతీయ అధ్యక్షులుకి కృతజ్ఞతలు తెలిపారు.

## రైతు సంక్షేమం కూటమి ప్రభుత్వ లక్ష్యం



తొట్టంబేడు,నవంబర్ 26 ప్రభాతవార్త: మండలంలోని పూడి గ్రామంలో బుధవారం అన్నదాత సుఖీభవ కార్యక్రమాలను తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజానాయుడు ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిధిగా హాజరైన శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి రైతులతో మమేకమయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నేడు కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్ద పీట వేసిందన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో రైతు సంక్షేమానికి ఎన్నో పథకాలు చేపట్టి అమలు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా తొట్టంబేడు మండలంలో రైతులకు సాగునీరు అందించిన ఘనత తెలుగుదేశం పార్టీదే అన్నారు. తెలుగుగంగ కాలువల ద్వారా సాగునీరందించి ఆదుకున్నా రన్నారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి రైతుల ఇంటింటికి వెళ్ళి అన్నదాత సుఖీభవ పథకంలో రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలు అందించిన ఆర్థిక సహాయం అందిందా? లేదా? అని ప్రశ్నించి అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమాల్లో మండల పార్టీ అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజానాయుడు, శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు, యూనిట్ ఇన్‌చార్జిలు లెక్కల మురళినాయుడు,ఎండిఓ సురేంద్రనాథ్, వ్యవసాయాధికారి సురేంద్రరెడ్డి, వెటర్నరి డాక్టర్ ఎ.డి గోవిదభాస్కర్ మాజీ ఎంపిటిసి మునిరత్నం బూత్ ఇన్‌చార్జి ప్రభాకర్ రైతులు శేషం నాయుడు, వసంత నాయుడు, పురుషోత్తం నాయుడు, జి.శంకర్ నాయుడు, సి.శంకర్ నాయుడు, కాసరం భాస్కర్‌నాయుడు, రామచంద్రానాయుడు, జి.విజయకుమారననాయుడు, చలపతి, చెంచయ్య, వాసునాయుడులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తిలో స్కందషష్టి పూజలు



శ్రీకాళహస్తి,నవంబర్ 26 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో బుధవారం పలు ఆలయాల్లో స్కందషష్టి సంబరాలను భక్తి శ్రద్దలతో నిర్వహించారు. శ్రీకాళహస్తిలోని శ్రీకాళహస్తీశ్వరాలయంలో వవెలసిన చెంగల్వరాయస్వామి ఆలయం, రంగుల గోపురం పక్కను ఉన్న వల్లి దేవసేన సమేత సుబ్రమణ్యం స్వామికి అలాగే కుమారస్వామి తిప్పపై వెలసిన కుమారస్వామి, తేరువీధిలో వవెలసిన షణ్ముఖ స్వామికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. సుబ్రమణ్యం స్వామికి షష్టి విశేషమైన రోజుగా భావించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్నదానాలు నిర్వహించారు. ఆలయార్చకులు ప్రసాద్ స్వామి మాట్లాడుతూ సుబ్రమణ్యం షష్టి అనేది విశేషంగా భావించి నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రియాంక,యామిని,భవ్య ఆలయ ఉభయదారులు, భక్తులు హాజరయ్యారు.

## ఐఎస్‌టిలో సంవిధాన్ దినోత్సవం 2025



కోట, నవంబర్ 26 ప్రభాతవార్త: మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో బుధవారం సంవిధాన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారత రాజ్యాంగ రూపకల్పన అధ్యక్షులు డాక్టర్ బిఆర్ అంబేడ్కర్‌ను స్మరించుకుంటూ విద్యార్థులకు రాజ్యాంగం విలువలపై అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసులు పాల్గొని భారత రాజ్యాంగ నిర్మాణ చరిత్ర, దాని గొప్పతనాన్ని వివరించారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే మౌలిక హక్కులు, మౌలిక బాధ్యతల ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగం పట్ల గౌరవం, సంఘీభావం, సమానత్వం, న్యాయం వంటి విలువలను పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ బి.వాసవి, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్లు సి.ఉదయ్‌కుమార్ రాజు,వి.హరికృష్ణారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## మంత్రి సత్యకుమార్‌ను కలిసిన శ్రీభారత్ ట్రస్ట్ చైర్మన్

కోట, నవంబర్ 26 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను రాష్ట్ర సచివాలయంలోని కార్యాలయంలో శ్రీభారత్ ట్రస్ట్ చైర్మన్ కె.కోటేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం ఈ మేరకు మంత్రిని కలిసిన ఆయన పలు అంశాలపై చర్చించారు.

## జనసేన పార్టీ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం



నాయుడుపేట రూరల్, నవంబర్ 26 ప్రభాతవార్త : పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం భారత రాజ్యాంగ 77వ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. నాయుడుపేట ఎఎంసి చైర్మన్, జనసేన పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఉయ్యాల ప్రవీణ్ ఆ పార్టీ నాయకులతో కలిసి డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అట్ల కృష్ణారావు, గిండి సతీష్, బాలు, కుంపటి శ్రీను, ఉపేంద్ర, మహేంద్ర, వీర మహిళలు రోహిణి, సల్మా, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం



నాయుడుపేట రూరల్, నవంబర్ 26 ప్రభాతవార్త: మున్సిపాలిటీ కార్యాలయంలో బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాతల దూరదృష్టి, దేశ నిర్మాణంలో వారి కృషి దేశ ప్రజలకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్‌ను... తిరుపతి జిల్లాలో మేలు



వెంకటగిరి, నవంబర్ 26 ప్రభాతవార్త : గూడూరు డివిజన్‌ను తిరుపతి జిల్లాలోనే ఉంచడం శుభ పరిణామం అని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని ఎన్ జేఆర్ భవనంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. గత ఎమ్మెల్యే ఆనం రాపూర్, కలువాయి, సైదాపురం మండలాలను ఆయన స్వార్థం కోసం నెల్లూరు జిల్లాలో కలుపుకున్నారని తెలిపారు. ఆ మూడు మండలాలను గూడూరు డివిజన్లో కలిపి తిరుపతి జిల్లా కిందకు తీసుకొచ్చారని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలను తిరుపతి జిల్లాలో కలపడం వల్ల ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.

## రైతుల సంక్షేమ ప్రభుత్వ లక్ష్యం



బాలాయపల్లి, నవంబర్ 26 ప్రభాతవార్త : రైతుల సంక్షేమ మే ప్రభుత్వ లక్ష్యమని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు రాయి సత్యం నాయుడు తెలిపారు. కయ్యూరు గ్రామంలో రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. రైతులకు ప్రభుత్వ అండగా ఉంటుందని తెలిపారు. ఏఎంసీ డైరెక్టర్ తాళ్లూరి ప్రసాద్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యానవన పంటలపై రైతుల దృష్టి సారించాలి

**- ఉద్యానవన విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు**



బాలాయపల్లి, నవంబర్ 26 ప్రభాతవార్త: రైతులు ఉద్యానవన పంటలపై దృష్టి సారించాలని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యానవన విశ్వవిద్యాలయం విస్తరణ అధికారి డాక్టర్ బి.జే రాజులు తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం, పెరియవరం ద్వారా మండలంలోనిజార్లపాడు గ్రామంలో మిరప పంటలో డా వై.ఎస్.ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం, లామ్, గుంటూరు వారు రూపొందించిన నూతన రకం ఎంసిఏ 643 రైతు స్థాయిలో పరిశీలన క్షేత్రాలను వైయస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డా. బి.గోవింద రాజులు సందర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి డా. డి. శ్రీధర్, శాస్త్రవేత్తలు డా. తిరుపాల్, డా. విజయశ్రీ, డా. పి. నాగార్జున రెడ్డి, డా. ఐ. రాజీవన మరియు రైతులు పాల్గొన్నారు.

## రైతన్న మీకోసం సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

వాకాడు, నవంబర్ 26 ప్రభాతవార్త: మండలంలోని బాలి రెడ్డిపాలెం గ్రామంలోని బుధవారం ఎంపీడీవో సాయి ప్రసాద్, తహసిల్దార్ సయ్యద్ ఇక్బాల్‌లు రైతన్న మీకోసం ఇంటింటా సర్వేను పరిశీలించారు. బాలిరెడ్డి పాలెం గ్రామంలోని ప్రజలకు అందిస్తున్న పథకాలుపై అధికారులు వివరించారు. ఈ సర్వేలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ శిల్ప, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



వాకాడు, నవంబర్ 26 ప్రభాతవార్త: మండల పరిషత్ కార్యాలయంలోని బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో సాయి ప్రసాద్, తహసిల్దార్ సయ్యద్ ఇక్బాల్‌లు ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి, ప్రతిజ్ఞ చేశారు. రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా ఎంపీడీవో సాయిప్రసాద్, తహసిల్దార్ సయ్యద్ ఇక్బాల్ సందేశానిచ్చారు.

## ఏఎంసీలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



వాకాడు, నవంబర్ 26 ప్రభాతవార్త: వాకాడులో ఏఎంసీ కార్యాలయంలోని బుధవారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏఎంసి చైర్ పర్సన్ ప్రమీల, వైస్ చైర్మన్, చీరకి మండల పార్టీ కన్వీనర్ దువ్వూరు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకుడు, దార సురేష్, ఏఎంసి కార్యాలయం సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



తడ, నవంబర్ 26 ప్రభాతవార్త: మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు బుధవారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలు మండల వైస్ ఎంపీపీ కుప్పంపాటి వెంకటేష్, ఎంపీడీవో శేఖర్ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రాజారెడ్డి వెలుగులు సీసీలు చంద్రయ్య జనార్ధన్ వెంకటేశ్వర్లు మురళి తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ దినోత్సవం వేడుకలు



తడ, నవంబర్ 26 ప్రభాతవార్త: భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బుధవారం సూళ్లూరుపేట వ్యవసాయ మార్కెట్ కార్యాలయం కొండూరు నందు రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారత రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి మార్కెటింగ్ కమిటీ చైర్మన్ ఆకుతోట రమేష్, కమిటీ సభ్యులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఓడూరు రవీందర్ రెడ్డి, కమిటీ సెక్రటరీ రామమ్మ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎపిఐఐసి డైరెక్టర్‌గా ప్రేమ్‌కుమార్ ప్రమాణస్వీకారం



కుప్పం, నవంబర్ 26 ప్రభాతవార్త: ఎపిఐఐసి డైరెక్టర్‌గా కుప్పంకు చెందిన తెదేపా సీనియర్ నేత మల్లానూరు ప్రేమ్‌కుమార్ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలో ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు అధ్యక్షతన ఈ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. కార్యక్రమ ంకు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, దగ్గుబాటి ప్రసాద్, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి హాజరయ్యారు. కుప్పం నుంచి కార్పోరేషన్ ఛైర్మన్ రాజశేఖర్, పికెఎం ఉడా ఛైర్మన్ బిఆర్ సురేష్‌బాబు, నేతలు బాబు, సుబ్బు, ఎవిరవి, బగ్గిడి వెంకటేష్, బేటప్పనాయుడు, విజయ్, పార్థసారథి, నాగే ంద్ర, వెంకటాచలపతి, రాధాకృష్ణమూర్తి, రామకృష్ణ, అన్నాదొరై, సంతానం, బాలకృష్ణ తదితర నేతలు హాజరయ్యారు.

## ఆగ్నేయ గణపతి విగ్రహ ప్రతిష్టాపన



శ్రీకాళహస్తి,నవంబర్ 26 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ఆగ్నేయ గణపతి విగ్రాహాన్ని బుధ వారం శాస్రోక్తంగా ప్రతిష్టించారు.ఇక్కడ ఆలయాన్ని జీర్ణోద్ధారణకు ఆలయాధికారులు నిర్ణయించారు. ఆక్రమణలకు గురైన ఆలయంను పునరుద్దరించుటకు నిర్ణయించారు. ఈ మేరకు ఆర్నెల్ల క్రితం బాలాలయం చేసారు. ఆక్రమణలను తొలగించి ఆలయాన్ని నిర్మించారు. తర్జన భర్జనల తరువాత ఆలయాన్ని అందులో విగ్రహాన్ని ప్రతిష్టించారు. మొదటిరోజు కలశ స్థాపన గావించి పూజలు నిర్వహించిన అర్చకులు బుధవారం ఉదయం నుంచి ధార్మిక కార్యక్రమాలు చేపట్టారు. ఆలయానికి సమీపంలోని బేరివారి మండపం వద్ద పూజా కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ఆలయ ప్రధానార్చకులు సంబంధం గురుకుల్ పర్యవేక్షణలో ఆలయ పోరోహితులు అర్ధగిరి స్వామి వేదపండితులు వేద మంత్రాలను పఠిస్తుండగా శాస్రోక్తంగా హోమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టె సాయిప్రసాద్,సభ్యులు కోలా విశాలాక్షి, రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు కోలా ఆనంద్‌కుమార్, వార్డుకు చెందిన తెలుగుదేశం నాయకుడు దుర్గాప్రసాద్, వజ్రం కిషోర్‌లు హాజరు కాగా ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి, డెప్యూటిఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి దంపతులు హాజరయ్యారు. ఏర్పాట్లును ఆలయ పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్ పర్యవేక్షించారు. గురువారం ఉదయం కుంబాభిషేకానికి సిద్దం చేస్తున్నారు.

## గణనాధుని దర్శించుకున్న రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి



కాణిపాకం, నవంబర్ 26 ప్రభాతవార్త: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణ కుటుంబ సమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఏఈఓ రవీంద్రబాబు, ఆలయ సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు, స్థానిక ఎస్సై నరసింహులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముంపు గ్రామాలను పరిశీలించిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి

కేవీబీ పురం, నవంబరు 26 ప్రభాతవార్త: నష్టాలను ఎంతైనా సహాయం అందించడానికి సిద్ధంగా ఉన్నామని, అవసరమైతే ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సదుపాయాలను కలుగుచేస్తామని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ముంపుకు గురైన గ్రామాలను పరిశీలించారు. మండలకేంద్రమైన కేవీబీ పురంలోకి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రాగానే భారీ ఎత్తున వైసీపీ కార్యకర్తలు, నాయకులు శాలువలతో సన్మానించారు. మాజీ మంత్రి మాట్లాడుతూ ఇళ్ల ఇంటి వద్ద నష్టాలు, పశు సంపద, భూములు కోతకు గురై అన్ని విధాల నష్టాలను సేకరించి తీసుకెళ్లి ప్రభుత్వం నుంచి జిల్లా కలెక్టర్ ద్వారా రావలసినటువంటి నష్టాన్ని సాయం అందిస్తామని తెలిపారు. ప్రభుత్వం మీద ఒత్తిడి తెస్తామని చెరువు పొందిన నష్టాలను ఎటువంటి నష్టాన్ని అయినా ప్రజలకు అందించేందుకు నూకతోటి రాజేష్, ఎంపీ గురుమూర్తి, కృష్ణయ్య, నందయ్య, ధనంజయరెడ్డిలు సహాయం అందించేందుకు పలువురు నాయకులు ఉండారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ గురుమూర్తి, సత్యవేడు ఇన్‌చార్జి నూకతోటి రాజేష్, పిచ్చాటూరు పార్టీ అధ్యక్షుడు రామచంద్ర, వైసీపీ నాయకులు బిరేంద్రవర్మ, మండల నాయకులు కృష్ణయ్య, మునిలక్ష్మి, నందకుమార్, రాష్ట్ర నాయకులు తెరని ధనంజయరెడ్డి, మాజీ జడ్పీటీసీ దేవిడ్, బాబుయాదవ్, బుర్ర మాధవిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజ్యాంగంపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరం

**-ఆకట్టుకున్న ఎగ్జిబిషన్ : ఏపిఎస్పీడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి**



తిరుపతిరూరల్, నవంబర్ 26 ప్రభాతవార్త: దేశ అభివృద్ధి, ప్రజాస్వామ్య పరిరక్షణకు భారత రాజ్యాంగం పునాది అన్న విషయాన్ని ప్రతి పౌరుడూ తెలుసుకోవాలని ఏపిఎస్పీడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి అన్నారు. బుధవారం తిరుపతిలోని ఏపిఎస్పీడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సిఎండి శివశంకర్ లోతేటి మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ భారత రాజ్యాంగ రూపకల్పనలో చూపిన దూరదృష్టి, సామాజిక న్యాయం పట్ల ఆయన చూపిన కట్టుబాటు నేటికి మార్గదర్శకమన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్స్ పి.ఆయూబ్ ఖాన్, కె.గురవయ్య, కె..రామ్మోహన్‌రావు, సిజిఎంలు పిహెచ్.జానకిరామ్, జె.రమణాదేవి, ఎన్.శోభా వాలెంటీనా, పి.సురేంద్రనాయుడు, ఎం.మురళీ కుమార్, ఎం.ఉమాపతి, కె.జనార్ధన్‌నాయుడు, జిఎంలు కృష్ణారెడ్డి, రామచంద్రరావు, విజయన్, చక్రపాణి, జగదీష్, భాస్కర్‌రెడ్డి, సురేంద్రరావు, శ్రీకాంత్, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, సుబ్బారావు, వెంకటరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పుత్తూరులో ఘనంగా లక్ష బిల్వార్చన



పుత్తూరు రూరల్, నవంబరు 26 ప్రభాతవార్త: పట్టణంలో శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర ఆలయ ప్రాంగణంలో వెలసిన శ్రీ అయ్యప్పస్వామివారి దేవాలయంలో 49వ లఘు లక్ష బిల్వార్చన, జ్యోతిపూజ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాల్గొని విశేష పూజలు చేశ్వారు. అనంతరం అయ్యప్పసేవా సమాజం వారు తీర్థ ప్రసాదాలు ఎమ్మెల్యేకి అందజేశారు.